ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్ ) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## సాగునీటి సంఘాలతో చెరువుల నిర్వహణ



TUESDAY 30TH SEPTEMBER 2025 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 182 COST : 3\- KHAMMAM, TELANGANA

మంగళవారం 30 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 181 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# మోగిన ఎన్నికల నగారా

**బిసి రిజర్వేషన్ల జీవో విడుదలతో లైన్ క్లియర్**
**మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహణ**
**తొలుత ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు**
**తరవాత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక**
**వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కుముదిని**



హైదరాబాద్,సెప్టెంబర్29: తెలంగాణలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. బిసి రిజర్వేషన్లపై భారీ కసరత్తు జరిగినా చివరకు 42 శాతం బిసి రిజర్వేషన్లకు జివో విడుదల కావడంతో స్థానికఎన్నికలకు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 656 జడ్పీటీసీ స్థానాలకు, 12,733 గ్రామపంచాయతీలు, 1లక్షా12వేల288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్
రాణి కుముదిని ప్రకటించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వివరాలు వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్




## నగరంలో పేదలకు రూ.5కే
# అల్పాహారం

**రెండుచోట్ల ప్రారంభించిన మంత్రి పొన్నం**



హైదరాబాద్,సెప్టెంబర్29:
హైదరాబాద్‌లోని పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా క్యాంటీన్' పథకాన్ని రేవంత్ సర్కార్ ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మోతీనగర్, మింట్ కాంపౌండ్ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కూడా పాల్గొన్నారు.
ఈ పథకం కింద ఒక్కో అల్పాహారంపై జీహెచ్ఎంసీ రూ. 14, మధ్యాహ్న భోజనంపై రూ. 24.83 భరించనుంది. దీని వల్ల ఒక్కో వ్యక్తిపై నెలకు సుమారు రూ. 3,000 ఆర్థిక భారం



## సరస్వతీ అలంకారంలో కనకదుర్గమ్మ

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు**

**విజయవాడ,సెప్టెంబర్29:**
ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగు తున్నాయి. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో శ్రీ సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దుర్గమ్మ వారి దర్శనానికి సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలలో పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో కొలువు తీరిన శ్రీదుర్గమ్మ వారికి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.



## సద్దుల బతుకమ్మ వేడుకలు

**పల్లెలతో సహా పట్టణాల్లో ఆనందోత్సాహం**



## గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ
# విధ్వంసం

**సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ**
**ప్రభుత్వంపై బిఆర్ఎస్ బురద జల్లుతూ విమర్శలు**
**మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,సెప్టెంబర్29:**
బీఆర్ఎస్ పార్టీ తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసునని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలనుు

## గ్రామీణ ప్రాంతాల స్ఫూర్తికి
# అద్దం పట్టిన మేళా

**మహిళా శక్తి బజార్‌ను సందర్శించిన గవర్నర్**
**రాజ్‌భవన్‌లో ఘనంగా బతుమ్మ వేడుకలు**

**హైదరాబాద్,సెప్టెంబర్29:**
శిల్పారామం పక్కన ఉన్న 'ఇందిరా మహిళా శక్తి బజార్'లో కొనసాగుతున్న సరస్ మేళాను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. 'మహిళా స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాళ్లు బాగున్నాయి. గ్రామీణ ప్రాంతాల



# సద్దుల బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్,సెప్టెంబర్29: సద్దులబతుకమ్మపై తెలంగాణ అంతటా గందరగోళం ఏర్పడింది. ఏ రోజు జరుపుకోవాలన్న సందిగ్ధత ఏర్పాడింది. చివరకు 9 రోజులు అయితే సోమవారం, గౌరమ్మను పంపించే వ్యవహారంతో సంబంధం లేకుండా మంగళవారం, మధ్యే మార్ంగా కొన్నిచోట్ల బుధవారం జరుపుకోవాలని నిర్ణయించారు. ఈ యేడు ఒక్కోచోట ఒక్కోరోజు సద్దుల బతుకమ్మ నిర్వహించడం గమనార్హం. మొత్తంగా తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగ తుది అంకానికి చేరింది. సద్దుల బతుకమ్మతో బతుకమ్మ సంబరాలు ముగియనున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా వరదలు ముంచెత్తడడంతో హైదరాబాద్ తదిర ప్రాంతాల్లో బతుకమ్మ కళ తప్పింది. ఊరూవాడా వారం రోజులుగా బతుకమ్మ పండగ జోరుగా సాగాల్సి ఉన్నా వర్షాల భయంభయంగా ఆడపడచులు బతుకమ్మను ఆడిపాడారు. ఆడపడుచుల రాకతో గ్రామాలు కళకళలాడాల్సి ఉన్నా ఎక్కడా పెద్దగా సందడి కానరాలేదు. గతంలో సద్దుల బతుకమ్మ వేడుకలుకు పల్లెలు మొదలు పట్టణాల వరకు ముస్తాబయ్యేయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా బతుకమ్మను నిర్వహించేవారు. సిద్దిపేట, వరగంల్ తదితర పట్టణాల్లో వేడుకలను ఘనంగా
నిర్వహిస్తారు. ప్రకృతి రమణీయకతకు బతుకమ్మ నిదర్శనం. ఆశ్వయుజ మాసం శుద్ధ పాఢ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను వేడుకగా జరుపుకుంటారు. రంగురంగుల పూలను త్రికోణాకృతిలో పేర్చి, అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ..ఆడి, పాడతారు. అప్పుడు మహిళలు పాడే పాటలు మనసుకు హత్తుకుంటాయి. ఏరోజు ప్రత్యేకత ఆ రోజుదే. ఇలా తొమ్మిది రోజులు ఆడిన బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి, నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని ఆడపడుచులంతా పంచు కుంటారు. తొమ్మిదో రోజు వేడుకగా సద్దుల బతుకమ్మను నిర్వహించి గౌరీదేవిని సాగనంపుతారు. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి దసరా ముందు శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరుపడం ఆనవాయితీ. ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించుకొనే బంగరు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి– అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు. పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. పూలతో బతుకమ్మ ఆవిర్భవించడం, ఆటపాటలతో అలరింతగా వేడుక చేయడం, నిమజ్జనంతో అనంత ప్రకృతిలో సంలీనం కావడం అనేవి– జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతాలుగా భావించాలి. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది. అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగించారు. తొమ్మిది రోజులూ గౌరీదేవి పుట్టింటికి తరలి వచ్చినట్లు భావిస్తారు. తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను భావిస్తూ, ఆరాధన చేస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మకు సాగనంపు వేడుక నిర్వహించడం సద్దుల బతుకమ్మ ప్రత్యేకత.

# మోగిన ఎన్నికల నగారా

పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఈసీ తెలిపారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాణికుముదిని వివరించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది ఎన్నికల కమిషన్. ఇందుకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరిపామన్నారు ఎన్నికల అధికారులు. ఇక ఎన్నికల్లో భాగంగా 565 మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీమొదటి విడత ఎన్నికలు జగనున్నాయి. ఇక అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండో దశ ఎన్నికలు జరగనుండగా.. అక్టోబర్ 31న మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 4న రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జగనున్నాయి. ఇక చివరగా నవంబర్ 8న మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. మొత్తంగా రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీనితో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే రాష్ట్రమంతటా ఎన్నికల సందడి మొదలవగా కొన్ని గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించబోవడం లేదని ఎస్ఈసీ ప్రకటించింది. కరీంనగర్, ములుగు జిల్లాల్లో 14 ఎంపీటీసీ, 27 గ్రామ పంచాయతీలకు 246 గ్రామ వార్డులు ఎన్నికలకు దూరంగా ఉండనున్నాయని స్పష్టం చేశారు. కోర్టు కేసుల కారణంగా ఇక్కడ ఎన్నికల నిర్వహణ సాధ్యం కావడం లేదని, హైకోర్టు ఆదేశాల మేరకు ఈ స్థానాల్లో ఎన్నికలు జరగబోవని తెలిపారు. ములుగు జిల్లాలోని 25 గ్రామ పంచాయతీలు, కరీంనగర్ జిల్లాలోని 2 పంచాయతీలకు ఎన్నికలు లేవని స్పష్టం చేశారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు– తొలివిడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11
పరిశీలన: అక్టోబర్ 12
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 15
ఎన్నికల తేదీ– అక్టోబర్ 23
ఓట్ల లెక్కింపు– నవంబర్ 11

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు– రెండో విడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15
పరిశీలన: అక్టోబర్ 16
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 19
ఎన్నికల తేదీ– అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు– నవంబర్ 11

గ్రామ పంచాయతీ ఎన్నికలు– తొలి విడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19
పరిశీలన: అక్టోబర్ 20
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 23
ఎన్నికల తేదీ, ఫలితాలు– అక్టోబర్ 31

గ్రామ పంచాయతీ ఎన్నికలు–రెండో విడత
నామినేషన్ల స్వీకరణ– అక్టోబర్ 21
చివరి తేదీ: అక్టోబర్ 23
పరిశీలన: అక్టోబర్ 24
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 27
ఎన్నికల తేదీ, ఫలితాలు– నవంబర్ 4

గ్రామ పంచాయతీ ఎన్నికలు–మూడో విడత
నామినేషన్ల స్వీకరణ– అక్టోబర్ 25
చివరి తేదీ: అక్టోబర్ 27
పరిశీలన: అక్టోబర్ 28
నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 31
ఎన్నికల తేదీ, ఫలితాలు– నవంబర్ 8

## గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ
# విధ్వంసం

విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చిందని ఆయన అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42? రిజర్వేషన్ కల్పించామన్నారు.

ప్రజల కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిందన్నారు. యువతకు గ్రూప్ 1, గ్రూప్ 2 తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1.05 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం, బహిరంగ మార్కెట్లో 56 రూపాయలు కిలో ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసి ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్నాం అన్నారు.

# సాగునీటి సంఘాలతో చెరువుల నిర్వహణ

## స్థానిక ఎన్నికల అనంతరం నిర్ణయం
## ఆల్మట్టిపై కెటిఆర్ ఆసంబద్ధ విమర్శలు
## మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్29: సాగునీటి సంఘాలతో చెరువులు, కాలువలు నిర్వహించాలని సీఎం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్నికల అనంతరం దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. మొదట చెరువులతో ప్రారంభించి పెద్ద ప్రాజెక్టుల వరకు విస్తరిస్తామన్నారు. ప్రతి సంఘానికి నీటిపారుదలశాఖ నుంచి ఒక అధికారి కన్వీనర్‌గా ఉంటారని చెప్పారు. రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్, సభ్యులతో చర్చించిన తర్వాత సంఘాలు ఏర్పాటు చేస్తాం. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని గతంలో కోదండరెడ్డి కోరారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచాలన్న కర్ణాటక నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో వాదిస్తాం. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదు. ప్రాజెక్టులపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆల్మట్టి ప్రాజెక్టుపై చేసిన కామెంట్స్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ప్రాజెక్టులపై పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం అడ్డగోలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆల్మట్టి ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టు స్టే ఉందని ఆయన గుర్తుచేశారు. ఆల్మట్టి ఎత్తు పెంపుకు తాము వ్యతిరేకమని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఎత్తు పెంచకుండా అడ్డుకుంటామని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచకుండా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు. కోర్టులో వాదనల కోసం సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించామని తెలిపారు. కృష్ణా, గోదావరి నీటి వాటాలో కాంగ్రెస్ హయంలోనే తెలంగాణకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయమే జరిగిందని ఆరోపించారు. కేటీఆర్ తన మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఉత్తమ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మిడిహట్టి ఆనకట్ట కోసం సవరణలతో డీపీఆర్ సిద్ధం చేస్తాం. కేబినెట్ ఆమోదం తర్వాత ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేపడతాం. చిన్న కాళేశ్వరం, కల్వకుర్తిపై కేబినెట్ పరిశీలనకు చర్యలు తీసుకుంటాం అని ఉత్తమ్ తెలిపారు. ఆల్మట్టి ఎత్తు పెంచొద్దనే అంశంపై సుప్రీం కోర్టులో స్టే ఉంది. ఈ ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మేం వ్యతిరేకం. సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేస్తాం. వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించాం. కృష్ణా, గోదావరి జలాల్లో కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. గత పదేళ్లలో నదీజలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయమే జరిగిందన్నారు. ఇదిలావుంటే

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రేపు(మంగళవారం) ఢిల్లీకి వెళ్లనున్నారు. ఉదయం 6:45 గంటలకు శంషాబాద్ నుంచి ఢిల్లీకి పయనం అవుతారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ఉత్తమ్ కలువనున్నారు. ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల పంట ప్రొక్యూర్ చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 52 లక్షల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్మెంట్ మాత్రమే కేంద్రం అనుమతి ఇచ్చిందని చెప్పారు. మిగిలిన ధాన్యం ప్రొక్యూర్మెంట్‌కు కూడా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేయనున్నట్లు
స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని గోదాముల్లో, రైస్ మిల్లులో ధాన్యం నిండిపోయి ఉందన్నారు. ధాన్యం తలింపుకు 300 ట్రైన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తానని మంత్రి ఉత్తమ్ వివరించారు. మంగళవారం దిల్లీ వెళ్లి ప్రహ్లాద్ జోషిని కలుస్తా. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని కోరతాం. రాష్ట్రంలోని గోదాముల్లో, రైసు మిల్లుల్లో ధాన్యం నిండిపోయాయి. వాటిని తరలించేందుకు 300 రైళ్లు ఇవ్వాలని కోరతామని ఉత్తమ్ వెల్లడించారు.



## నగరంలో పేదలకు రూ.5కే
# అల్పాహారం

తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అల్పాహారం కోసం 'హరే రామ, హరే కృష్ణ' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సాధారణంగా రూ. 19 ఖర్చయ్యే టిఫిన్‌ను కేవలం రూ. 5కే, అలాగే రూ. 30 ఖర్చయ్యే భోజనాన్ని రూ. 5కే అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మొదటగా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా.. గత 10 సంవత్సరాలుగా లేని రేషన్ కార్డులు తమ ప్రభుత్వం అందించిందని, అలాగే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. అంతేకాకుండా మహిళా సాధికారత కోసం రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సోలార్ ఎ÷–లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల యజమానులుగా చేసే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యుల సంఖ్యను 16 నుంచి 65 వరకు మార్చి, సున్నా వడ్డీకే రుణాలు ఇస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా.. హైదరాబాద్‌లో పనిచేసే వారికి అక్కడే ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని.. కొల్లూరులో ఇళ్లు నిర్మించి ఇవ్వడం వల్ల ఉపయోగం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ.. ఇందిరా క్యాంటీన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

హైదరాబాద్,సెప్టెంబర్29: హైదరాబాద్‌లోని పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా క్యాంటీన్' పథకాన్ని రేవంత్ సర్కార్ ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మోతీనగర్, మింట్ కాంపౌండ్ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కూడా పాల్గొన్నారు.

ఈ పథకం కింద ఒక్కో అల్పాహారంపై జీహెచ్ఎంసీ రూ. 14, మధ్యాహ్న భోజనంపై రూ. 24.83 భరించనుంది. దీని వల్ల ఒక్కో వ్యక్తిపై నెలకు సుమారు రూ. 3,000 ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అల్పాహారం కోసం 'హరే రామ, హరే కృష్ణ' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సాధారణంగా రూ. 19 ఖర్చయ్యే టిఫిన్‌ను కేవలం రూ. 5కే, అలాగే రూ. 30 ఖర్చయ్యే భోజనాన్ని రూ. 5కే అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మొదటగా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా.. గత 10 సంవత్సరాలుగా లేని రేషన్ కార్డులు తమ ప్రభుత్వం అందించిందని, అలాగే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. అంతేకాకుండా మహిళా సాధికారత కోసం రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సోలార్ ఎ÷–లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల యజమానులుగా చేసే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యుల సంఖ్యను 16 నుంచి 65 వరకు మార్చి, సున్నా వడ్డీకే రుణాలు ఇస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా.. హైదరాబాద్‌లో పనిచేసే వారికి అక్కడే ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని.. కొల్లూరులో ఇళ్లు నిర్మించి ఇవ్వడం వల్ల ఉపయోగం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ.. ఇందిరా క్యాంటీన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## గ్రామీణ ప్రాంతాల స్ఫూర్తికి
# అద్దం పట్టిన మేళా

స్ఫూర్తి, మార్కెటింగ్ ఇన్నోవేషన్‌కు ఈ మేళా అద్దం పడుతోంది. 20కిపైగా రాష్ట్రాల ప్రతినిధులు ఏర్పాటు చేసిన 150కిపైగా స్టాళ్లు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. తెలంగాణలోని నకాశీ చిత్రకళ నుంచి ఒడిశా పట్టచిత్రాల వరకు అన్నీ ఇక్కడ లభిస్తున్నాయి. మేళాను చక్కగా నిర్వహిస్తున్నారు.'ఇందిరా మహిళా శక్తి' నినాదం ద్వారా 65 లక్షల మంది మహిళలు సంఘటితమవుతున్నారు. తెలంగాణలో మహిళా సాధికారత అనేది ఉద్యమంలా ముందుకు సాగడం సంతోషంగా ఉంది. నేను గతంలో పోచంపల్లిని సందర్శించాను. అక్కడ లభించేవి కేవలం చీరలు, దుస్తులే కావు.. తెలంగాణ చరిత్ర సంస్కృతి' అని గవర్నర్ పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులను గవర్నర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు మంత్రి సీతక్క గవర్నర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. మహిళా కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పాల్గొన్నారు. ఇదిలావుంటే రాజ్‌భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. గవర్న జిష్టుదేవ్ వర్మ,ఆయన సతీమణి సుధావర్మలు హాజరై బతుకమ్మలను తిలకించారు. వారిని అభినందించారు.

## సరస్వతీ అలంకారంలో కనకదుర్గమ్మ

అనంతరం దేవాలయం బయట సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని చంద్రబాబు నాయుడు వివరించారు. సతీసమేతంగా ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. చినరాజగోపురం వద్ద స్థానాచార్యులు శివ ప్రసాద్‌శర్మ సీఎంకు పరివేష్టం కట్టారు.

## నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
### ఆటో,కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు దుర్మరణం

నల్గొండ,సెప్టెంబర్29: నల్గొండ జిల్లాలోని చింతపల్లి మండలం నసర్లపల్లి గేటు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై ఆటో, కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులతోపాటు అదే రహదారిపై వెళ్లున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని.. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అత్యవసర చికిత్స కోసం దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఇక మృతదేహాలను సైతం స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో వీరంతా దేవరకొండ మండలం ముదిగొండ అవాసం మటిక తండా వాసులుగా పోలీసులు గుర్తించారు. మృతులు.. రాత్లావత్ భాస్కర్ (29), రాత్లావత్ వినోద్ (29), సఫవత్ రవి (29) గా గుర్తించినట్లు పోలీసుల తెలిపారు.

## స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం : రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్29: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలస్యమైనా తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రపతి, గవర్నర్‌ల పేరిట కాలయాపన చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండేళ్లకే కాంగ్రెస్ మీద ప్రజలకు విరక్తి కలిగిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురువేస్తామని ధీమా వ్యక్తం చేశారు రాంచందర్ రావు తమ గెలుపునకు స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనం కాబోతున్నాయని ఉద్ఘాటించారు. తమకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. తాను స్వయంగా ఇప్పటివరకు 23 జిల్లాల్లో యాత్రలు చేశానని తెలిపారు. ఇంకో నాలుగు జిల్లాల్లో యాత్ర చేయాల్సి ఉందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను తామే గెలువబోతున్నామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా ఇసుక, కంకర అక్రమ దందా. ఇసుక, కంకర అక్రమ తరలింపుపై విచారణ జరిపించాలి.

### జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్.



భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్ – : కొత్తగూడెం నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, కంకర, మట్టి అక్రమ తరలింపుపై విచారణ జరిపించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, కంకరకు అనుమతులు లేకున్నా కాంట్రాక్టర్లు అక్రమ పద్ధతిలో దొడ్డిదారిన రవాణా చేసుకుంటూ పనులు చేస్తున్నారని ఆరోపించారు. స్టాక్ పాయింట్లు ఏర్పాట్లు చేసుకొని మరీ ఇసుక, కంకర దందా చేస్తూ మమ్ముళ్ళ మత్తుకు అలవాటు పడిన కొంతమంది మైనింగ్, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు నాలుగు రోజులు హడావుడి చేయడం ఆ తర్వాత అటువైపున కన్నెత్తి చూడకపోవడం పై పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. అదేవిదంగా నియోజకవర్గంలో ఎవరు ఎన్నికల్లో గెలిచిన ఇసుక ర్యాంప్ లు నడవకుండా ఉద్దేశపూర్వకంగా కుట్రలు చేసి లక్షల రూపాయలు నెలవారీ మమ్ముళ్ళు వసూలు చేసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి పడేలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమ ఇసుక, కంకర, గ్రావెల్ తవ్వకాల్లో లక్షల రూపాయలు చేతులు మారుతున్న వైనంపై, పరోక్షంగా సహకరిస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం నియోజకవర్గ పరిధిలో ఇసుక రీచ్ ల సర్వే నిర్వహించి ఇసుక ర్యాంప్ లు తెలరవాలని అదేవిధంగా గ్రావెల్ క్వారీలకు అనుమతులు మంజూరు చెయ్యాలన్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని అన్నారు. బిల్లులతో కూడిన కంకర అందుబాటులో ఉండేటట్లు చొరవ తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో జేబీపీ తరుపున పెద్దయెత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మురళి, సోనూ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తివిద్యను అభ్యసించే విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి.

**ఏటిసీలు విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు దోహదం.**

**ఏటీసీల రూపకల్పనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.**

**రుద్రంపూర్లో ఏటీసీని ప్రారంభించిన ఎమ్మెల్యే..**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.**




భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం / సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్ – : వృత్తివిద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు సర్టిఫికెట్లకోసం కాకుండా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునే దిశగా శ్రమించాలని, అప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ ఏరియా, 4 ఇంక్లైన్లో అధునాతన సాంకేంతిక కేంద్రం (ఏటీసీ)ని సోమవారం అయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ వృత్తివిద్యను అభ్యసించే విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ఏటీసీల్లో దోహదపడతాయని, గ్రామీణ ప్రాంతాల యువతకు, విద్యార్థులకు ఏటీసీలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ఐటిఐలను ఏటిసీలుగా మారుస్తూ విద్యార్థులను టెక్నాలజీ రంగంలో ప్రోత్సహించేందుకు ప్రతుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఇది నైపుణ్య శిక్షణ విస్తరణలో ఒక కీలక అడుగున అభినందించారు. ఏటిసీల ద్వారా యువతకు పారదర్శకమైన శిక్షణ అయిందించడం ద్వారా రాష్ట్రము టెనాలజీ హబ్ గా అభివృద్ధి సాధిస్తుందన్నారు. కేంద్రాన్ని యువకులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, వట్టికొండ మల్లికార్జునరావు, నాయకులూ తోట రాజు, ప్రిన్సిపాల్ గొనెల రమేష్, సిబ్బంది, అధికారులు శోభన్ బాబు, బి రాము, నర్మద తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐలో భారీ చేరికలు.

**కూనంనేని సమక్షంలో 220కుటుంబాలు సిపిఐలో చేరిక.**

**సేవల ఫలితంగానే సిపిఐని ఆదరిస్తున్ని నియోజకవర్గ ప్రజలు.**

**నియోజకవర్గంలో సిపిఐకి తిరుగులేదు.**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని.**








**భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్ – :**
సుజాతనగర్ మండల సర్వారం, చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండా, పాల్వంచ మండలం దండెలబోర గ్రామాలకు చెందిన 220 కుటుంబాలు ఆదివారం రాత్రి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సమక్షంలో ఆదివారం రాత్రి సిపిఐ జిల్లా కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో సిపిఐలో చేరారు. వీరికి ఎర్రకండువా కప్పి పార్టీలోని
ఆహ్వానించారు, పార్టీ ప్రాధమిక సభ్యత్వాన్ని ఆదించారు . ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ప్రజల కష్టాలు గుర్తించి వారి సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. గడిచిన ఇరవై నెలల కాలంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారంకోసం అనునిత్యం శ్రమిస్తున్నాని, ప్రజాభి వృద్ధి కి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో సిపిఐకి తిరుగులేదని, ప్రజలకు అందిస్తున్న సేవ కార్యక్రమాలకు ప్రజలు సిపిఐని ఆదరిస్తున్నారని అన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న వారు ప్రజాసేవలను విస్తరించడం ద్వారా పార్టీని మరింత అభివృద్ధి చేయాలని, వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, నాయకులు రాంచందర్, బానోతు గోవిందు, మన్నెం వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వహణ లోపం వల్లే బస్టాండులో అసౌకర్యాలు..





**ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి.**

**సిబ్బందిని వేధించడం మాని సౌకర్యాలకల్పనపై దృష్టిపెట్టండి.**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.**

**భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్ – :**
అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణలోపంవల్లే ఆర్టీసీ బస్టాండు అసౌకర్యాలకు నిలయంగా మారిందని, అధికారులు తీరు మార్చుకొని సౌకర్యాల మెరుగుపై ద్రుష్టి సారించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండును అయన ఆకస్మికంగా సందర్శించారు. అసౌకర్యాలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండుకు నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వచ్చి పోతుంటారని, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ లోపం, ఆవరణ పారిశుధ్య లోపం స్పంష్టంగా కనిపిస్తోందని దీన్ని సరిచేయాల్సిన అధికారులు నిర్లక్షయంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సిబ్బందిని వేదించడంపైనే ద్రుష్టి సారిస్తున్న విషయం తనదృష్టికి వచ్చిందని, దీన్ని సరిచేసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలకు సిఫారసు చేస్తాఅని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్టాండు నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులకోసం ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని, త్వరలో నిధులు మంజూరవుతాయని తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, ఆర్టీసీ అధికారులు వున్నారు.

# జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్ నందు ఘనంగా ఆయుధపూజ.

**దేవీ నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన ఆయుధ పూజలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్.**







**భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్ –**
సోమవార హేమచంద్రాపురం నందు గల జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు దసరా నవరాత్రుల సందర్భంగా ఆయుధ పూజను ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పాల్గొన్నారు. ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్యస్వామి, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్ మరియు సీఐలు, ఆర్ఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆయుధ పూజ అనంతరం వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడంలో భాగంగా సోమవారం ఆయుధ పూజా కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బందికి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.


# విలేజ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చెయ్యాలి : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్ –:**
ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమలులో భాగంగా జిల్లా పంచాయతీల సమగ్రాభివృద్ధి కోసం విలేజ్ యాక్షన్ ప్లాన్ ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ఆది కర్మయోగి కార్యక్రమం క్రింద ఉన్న 130 గ్రామ పంచాయతీలలో విలేజ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడం అత్యవసరమని స్పష్టంచేశారు. గ్రామాల అభివృద్ధి కోసం బోర్వెల్ మరమ్మతులు, కొత్త బోర్వెల్లు, రోడ్లు, వాటర్ ట్యాంకులు, విద్యుత్ సదుపాయాలు, వ్యవసాయ ఆధునికీకరణ, డ్రోన్ల వినియోగం, ట్రాక్టర్లు, వాటర్ సెట్స్, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, విద్యార్థుల కోసం డైనింగ్ హాల్స్, వైద్య సౌకర్యాలు, గ్రామాలలో పంట విస్తీర్ణం వివరాలు వంటి అంశాలను చేర్చి నివేదికలు సమర్పించాలని సూచించారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని గ్రామ పంచాయతీలలో ఆది సేవ కేంద్రాలను ప్రారంభించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం విలేజ్ యాక్షన్ ప్లాన్ ను ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేసే ప్రక్రియను ఐటీడీఏ పీవో రాహుల్ పర్యవేక్షించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.
అక్టోబర్ 2న ఆది కర్మయోగి అభియాన్ అమలవుతున్న అన్ని 130 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించాలనీ, ఆ గ్రామసభలలో ప్రజల అవసరాలు, అభివృద్ధి సూచనలు, కార్యాచరణలపై చర్చించి వాటిని ప్రణాళికల్లో ప్రతిబింబింపజేయాలని తెలిపారు. గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం సంబంధిత శాఖలు పరస్పర సమన్వయం కలిగి, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా, సమయపాలనతో కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) సెప్టెంబర్ 29:**
తెలంగాణ పూల పండుగ బతుకమ్మ ముగింపు చివరి రోజు "సద్దుల బతుకమ్మ"ను పురస్కరించుకొని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు.
తెలంగాణ ప్రజల జీవన విధానంలో నుంచి పుట్టిన ప్రకృతి పండుగే బతుకమ్మ పండుగ అని అన్నారు. దేవతలను అర్చించే పువ్వులే బతుకమ్మగా పూజలందుకోవడం తెలంగాణ ప్రజలకు ప్రకృతి పట్ల ఉన్న ఆరాధనను, కృతజ్ఞత భావనను తెలియజేస్తుందని తెలిపారు. సబ్బండ వర్గాలు సమిష్టిగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనదని వెల్లడించారు. పచ్చదనం, పాడి పంటలు, పశుసంపద, ప్రకృతి వనరుల సమృద్ధితో నేడు తెలంగాణ రాష్ట్రం నిండైన బతుకమ్మను తలపిస్తున్నదని అన్నారు. గ్రామాల్లో నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై తొమ్మిది రోజుల పాటు సాగిన బతుకమ్మ ఆడబిడ్డల ఆటపాటలతో పల్లెలు, పట్టణాలు సాంస్కృతిక శోభను సంతరించుకున్నాయని అన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



ఓదెల/ పెద్దపల్లి సెప్టెంబర్ 29(అక్షరం న్యూస్).

సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడుతున్నారు ఓదెల మండలంలోని గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ సందర్భంగా ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు. మహిళలు పిల్లలు అందరు కలిసి రంగురంగుల పూలతో పేర్చిన బతకమ్మను ఒక దగ్గర కు చేర్చి బతుకమ్మ పాటలను పాడుతూ అంగరంగ వైభవంగా డీజే పాటలతో దాండియా కోలాటాల ఆటలతో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నారు .తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర మహిళలకు ప్రత్యేకంగా నిలుస్తుంది.తెలంగాణ సాంస్కృతికి సాంప్రదాయానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ.రాష్ట్రంలో సద్దుల బతుకమ్మ పండుగ ప్రత్యేకమైన గుర్తింపు ఉందని



సందర్భంగా మహిళలందరూ రక రకాల పూలు చామంతి బంతి గుణుగు పూలు పట్టుకుచ్చులు వివిధ రకాల పూలు,రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి పసుపు తో చేసిన గౌరమ్మ ను పూల మధ్యకు చేర్చి పూజచేస్తారు. గ్రామంలోని మహిళలందరూ కలిసి బతుకమ్మ లను ఒక్క దగ్గర చేర్చి బతుకమ్మ పాటలతో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉంది.సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు,పిల్లలు బతుకమ్మ పాటలు పాడుతూ,కోలలతో కోలాటం ఆడూతూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మహిళలందరూ కలిసి బతుకమ్మను గౌరవప్రదంగా ఆడి పాడుతున్నారు సద్దుల బతుకమ్మ సంబరాలకు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శులు మరియు నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు అదేవిధంగా బతుకమ్మ సంబరాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తగిన బందోబస్తు నిర్వహించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు అనంతరం గంగమ్మ ఒడిలోకి గౌరమ్మ చేరింది పోయిరా గౌరమ్మ పోయిరావంటూ సత్తు పిండి వైనాలు ఒకరికొకరు పుచ్చుకున్న మహిళలు వర్షం లేకపోవడంతో చాలా ఆనందంతో దాదాపు ఒంటిగంట దాకా సద్దుల బతుకమ్మ సంబరాలను నిర్వహించుకున్నారు ఎంతో ఆనందంతో కోలాటాలు నృత్యాలు డీజే పాటలు దాండియా తదితర బతుకమ్మ పాటలతో అలరించి ఉత్సాహంగా పాల్గొన్నారు

## ప్రకృతిలో దొరికే పూలతో ప్రారంభమై ప్రకృతిలో కలిసే ఏకైక పండుగ బతుకమ్మ

సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్. వొడితల ప్రణవ్





కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్:

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి ఏరియాలో సద్దుల బతుకమ్మ కార్యక్రమంలో పాల్గొన్న హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా దొరికే పులతో ప్రారంభమై ప్రకృతిలో కలిసే ఏకైక పండుగ బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి బతుకమ్మను ఎత్తుకున్నారు. కొత్తపల్లి మహిళా సోదరీమణులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి . మాజీ కౌన్సిలర్లు దేశిని రాధా సదానందం .ఎలగందుల సరూప శ్రీహరి. పిట్టల శ్వేత రమేష్ మాజీ ఉపసర్పంచ్ దేశిని శ్రీనివాస్ . పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ కొత్తపల్లి ప్రాంత పుర ప్రముఖులు ఓజ్జ శ్రీనివాస్ సంకీర్త సురేష్ . జేరిపోతుల కన్నయ్య . సంపత్ అఖిల్ రమేష్ శ్రీనివాస్. ఉడుత వెంకటేష్ రామచంద్రం పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ చౌరస్తా లో పండుగ పూట ఐనా ట్రాఫిక్ ని చక్కదిద్దే వారేరి?

**-చొప్పదండి ఎన్టీఆర్ చౌరస్తా లో బతుకమ్మ పండుగ**
**-రోజున విపరీతమైన జన సందోహం**
**-బతుకమ్మ పండుగ పూలు,, ఇతరత్ర వస్తువులు**
**-కొరకు మండలం మొత్తం ఎన్టీఆర్ చౌరస్తా కు రాక**
**-ట్రాఫిక్ అదుపుకి ఎలాంటి ఏర్పాటు చెయ్యని పోలీస్ శాఖ**
**-కనీసం పోలీస్ శాఖ వారికి సూచననో, సలహా నో లేదా ట్రాఫిక్ అదుపు చేసే ఏర్పాటు కొరకు ఒత్తిడి**
**-తీసుకురాని చొప్పదండి పట్టణ రాజకీయ నాయకులు అని అంటున్న ప్రజలు**
**-ఇప్పటికీ అయినా రాజకీయ నాయకులు చొరవ తీసుకోవాలి అని అంటున్న ప్రజలు**
**-పోలీసు శాఖ వారు కూడా వెంటనే తగు ఏర్పాట్లు చేయాలి అని అంటున్న ప్రజలు**





చొప్పదండి /కరీంనగర్, సెప్టెంబర్( 29 అక్షరం న్యూస్ )

చొప్పదండి పట్టణం లోని ఎన్టీఆర్ చౌరస్తా లో సోమవారం రోజున బతుకమ్మ పండుగ సందర్భంగా విపరీతమైన రద్దీ ఏర్పడింది. చొప్పదండి పట్టణం తో పాటు, మండలం లోని ప్రజలు ముఖ్యం గా బతుకమ్మ కొరకు ఉపయోగించే తంగేడు పూలు, గునుగు పువ్వు, చెమంతి పువ్వు, పట్టు కుచ్చు పువ్వు, ఇతరత్ర పూలు, ఇతర సామాగ్రీ కొరకు ఎన్టీఆర్ చౌరస్తా కు రావటం వలన జన సమ్మర్థ్యం ఎక్కువ అయింది గత నాలుగు రోజుల నుంచే ఎన్టీఆర్ చౌరస్తా లో జన సమ్మర్థ్యం పెరిగింది. పూలు, ఇతరత్రా అమ్మే వారు కూడా ఎన్టీఆర్ చౌరస్తా లో అమ్మితేనే ప్రజలు ఎక్కువగా రావటం వలన అమ్మకాలు బాగుంటాయాని ఎన్టీఆర్ చౌరస్తా లోనే తమ దుకాణం లను రోడ్డు మీద ఏర్పాటు చేసుకున్నారు అలాగె ఎన్టీఆర్ చౌరస్తా లో బట్టల దుకాణం లు, మహిళలకు సంబందించిన బ్యాంగిల్స్ స్టోర్స్ ఉండటం పురుషులు, పిల్లల డ్రెస్సెస్ ఉండటం, కిరాణా దుకాణం లు ఉండటం వలన కూడా చొప్పదండి పట్టణం, మండలం లోని ప్రజలందరూ ఎన్టీఆర్ చౌరస్తా కె వస్తారు.

దీనివలన ఎన్టీఆర్ చౌరస్తా లో గత నాలుగు రోజులుగా విపరీతమైన రద్దీ ఏర్పడుతుంది ముఖ్యం గా సోమవారం రోజున బతుకమ్మ పండుగ రోజున విపరీతమైన జన సమ్మర్థ్యం తో విపరీతమైన ట్రాఫిక్ అయింది.

విపరీతమైన ట్రాఫిక్ అయినప్పటికి పోలీస్ శాఖ వారు ఎలాంటి ఏర్పాటు చేయకపోవటం వలన వాహనం %శ్రీబ% అస్తవ్యస్తంగా ఇస్తారీతిన వెళ్ళటం తో ప్రజలు ఇబ్బందులకు గురి అయినారు. ఇంత ట్రాఫిక్ వున్నప్పుడు పోలీస్ శాఖ వారు ట్రాఫిక్ ని అదుపులో ఉంచేందుకు ఒక ఇద్దరు కానిస్టేబుల్ లను ఎన్టీఆర్ చౌరస్తా లో అందుబాటులులో ఉంచితే చాలా మట్టుకు ట్రాఫిక్ అదుపులో ఉండేది. కానీ పోలీస్ శాఖ వారు అలాంటి ఏర్పాటు ఏదీ కూడా చెయ్యలేదు.

ప్రతీ రోజు ఎన్టీఆర్ చౌరస్తా లో పోలీస్ శాఖ వారు ట్రాఫిక్ అదుపుకి ఏర్పాటు చేయల్సిన పోలీస్ శాఖ వారు కనీసం దసరా పండుగ ముందు నుంచి అనగా గత నాలుగు రోజుల నుంచి ముఖ్యం గా సోమవారం వారం రోజున బతుకమ్మ పండుగ రోజున ట్రాఫిక్ అదుపుకి ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవటం ఏమిటని ప్రజలు అనుకుంటున్నారు. అదేవిదంగా రాజకీయ పార్టీ నాయకులు అయినా పోలీస్ వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చి ఎన్టీఆర్ చౌరస్తా లో ప్రతీ రోజు ట్రాఫిక్ అదుపుకి పోలీస్ శాఖ వారు ఏదయినా ఏర్పాటు అనగా పోలీస్ క్యాబిన్ లేదా పోలీస్ ఔట్ పోస్ట్ లాంటి ఏర్పాటు చేసే విధంగా, మరీ ముఖ్యం గా ముఖ్యమైన పండుగరోజుల్లో కూడా ఎటువంటి ఏర్పాట్లు చేయించకపోవటం పై పట్టణ రాజకీయ నాయకులను కూడా ప్రజలు విమర్శిస్తున్నారు.

ఇక ముందు అయినా ప్రతీ రోజు ఎన్టీఆర్ చౌరస్తా లో ట్రాఫిక్ అదుపుకి పోలీస్ శాఖ వారు ఏర్పాటు చెయ్యాలని, ఒకవేళ పోలీస్ శాఖ వారు అలాంటి ఏర్పాటు చెయ్యకపోతే చొప్పదండి పట్టణం లోని అన్ని పార్టీ ల రాజకీయ నాయకులు వారి వారి రాజకీయ పార్టీలకు అతీతంగా పోలీస్ శాఖ వారికి సలహా రూపంలోనో, లేదా సూచనగానో ఏర్పాటు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## కన్నుల పండుగగా సద్దుల బతుకమ్మ సంబరాలు





కామారెడ్డిజిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్ 29/ అక్షరంన్యూస్:

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు మునిసిపల్ కేంద్రంలోని నాలుగవ వార్డు పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో స ద్దుల బతుకమ్మ సంబరాలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు ఎంగిలి పూల బ తుకమ్మతో ప్రారంభమై తీరొక్క పూలతో అ లంకరించిన సద్దులబతుకమ్మతో ముగిసిన ఈ పండుగలో మహిళలు పెద్ద ఎత్తున పా ల్గొన్నారు తీరొక్క పువ్వుల కలయికతో బ తుకమ్మలను గ్రామ చావడిలో ఏర్పాటు చే సిన మహిళలు సాంప్రదాయ పాటలతో బ తుకమ్మ ఆటలుఆడుతూఆనందంపంచుకున్నారు గౌరమ్మగా కొలిచే బతుకమ్మ సం బరాలు స్థానిక చెరువు కాలువలో నిమజ్జ నంతో ముగిసే ఈ పండుగ ప్రకృతి దేవత ను ఆరాధిస్తూఆడపడుచుల ఆత్మగౌరవం ప్రకృతి ప్రేమకుప్రతీకగానిలుస్తోంది తెలంగా ణ సంస్కృతి సాంప్రదాయాల ప్రత్యేకతను ప్రతిబింబించే ఈ బతుకమ్మ పండుగను గ్రామస్తులుహర్షంఉత్సాహంతోజరుపుకున్నా రుఅమావాస్య నుంచి తొమ్మిది రోజుల పా టు మహిళల కలయిక పూలతో అలంకర ణ సంప్రదాయ ఆడపాటలతో బతుకమ్మ ను ఆస్వాదించడం గ్రామానికి ప్రత్యేకంగా శోభనవంతమైన పండుగ శోభను నింపిం దనీ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు

# అయోమయంలో మైనారిటీ ఒంటరి మహిళలు

**దరఖాస్తు చేసుకోవాలంటే తహసిల్దార్ ధృవీకరణ పత్రం తప్పనిసరి ఇవ్వలేమంటున్న తహసిల్దార్**
**సమస్యను పరిష్కరించాలని తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించిన మైనారిటీ సభ్యులు**

కామారెడ్డిజిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్29/ అక్షరంన్యూస్:తెలంగాణలోని కాంగ్రెస్ ప్ర భుత్వం రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమం కోసం నూతనంగా రెండు సంక్షేమ పథకాల ను ప్రవేశపెట్టింది ఇందులోమైనారిటీ ఒంట రి మహిళల కోసంఇందిరమ్మ మైనారిటీ మ హిళ యోజన అనే పథకాన్ని ప్రవేశపెట్టింది దీని కింద వితంతువులు విడాకులు తీసు కున్న వారు అనాధలు ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి కోసం 50 వేల ఆర్థిక సహా యాన్ని అందిస్తారు ఈ పథకానికి అర్హులైన మహిళలు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దర ఖాస్తు చేసుకోవచ్చు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చే యాలంటే ఒంటరి మహిళలు తహసిల్దార్ ద్వారా జారీ చేయబడిన ధృవీకరణ పత్రా న్ని సమర్పించాల్సి ఉంది ధ్రువీకరణ పత్రం కొరకు తహసిల్దార్ కార్యాలయానికి వెళితే ఒంటరి మహిళలకుధ్రువీకరణ పత్రం ఇవ్వ లేమని మాకు ఎటువంటి ఆదేశాలు రాలే దని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారని ఒంటరి మహిళలుఆవేదనవ్యక్తంచేస్తు న్నా రు దీంతో ఒంటరి మహిళలు పడుతున్న ఇ బ్బందులదృశ్య సోమవారంఎల్లారెడ్డిము స్లిం మైనారిటీ వెల్ఫేర్ కమిటీ



అధ్యక్షుడు షే క్ గయాజుద్దీన్ కమిటీ సభ్యులతో కలిసి త హసిల్దార్ కార్యాలయానికివెళ్లి తహసిల్దార్ ప్రేమ్ కుమార్ ను కలిసి ధ్రువీకరణపై స్పష్ట త కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారుఈ సందర్భంగా ఆయన మహిళలుపడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్య ను త్వరగాపరిష్కరించాలనికోరారు ఈ కా ర్యక్రమంలో సయ్యద్ మీర్ ముకరంఅలీ అ హ్మద్ హబీబ్ జాని అజీజ్రహ్మాన్ తదితరు లు పాల్గొన్నారు

## ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అ మ్మవారిని ప్రార్థించిన మాజీ మున్సిపల్ చైర్మన్

కామారెడ్డిజిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్ 29/ అక్షరంన్యూస్:

దేవీనవరాత్రి ఉత్సవాల సం దర్భంగా సోమవారం మాజీ మున్సిపల్ చై ర్మన్ కుడుముల సత్యనారాయణ వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన దుర్గామాత అమ్మ వారిని దర్శించుకున్నారు మొదటగా ఎల్లా రెడ్డి పట్టణ కేంద్రంలోని మూడోవార్డునయా బాద్ శ్రీరామసేన దుర్గామాత ఆలయంలో అమ్మవారు ఎనిమిదవ రోజు సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు ప్ర త్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆయ నఎల్లారెడ్డి పట్టణ పరిసర ప్రాంత ప్రజలసు ఖసంతోషాలు అభివృద్ధి కోసంఅమ్మవారిఆశీర్వచనాలు పొందారు అనంతరం ఆయన మండలంలోని బ్రాహ్మణపల్లి దుర్గామాత ఆలయానికి వెళ్లి గ్రామ భక్తులతోకలిసి కుం కుమార్చనలో పాల్గొన్నారు పాడిపంటలు బాగా పండాలని రైతులుసుఖంగాఉండాల ని అమ్మవారిని ప్రార్థించారు అలాగే అడవి లింగాల గ్రామంలోని దుర్గామాత ఆలయం లో భక్తులతో కలిసిపూజ కార్యక్రమంలో పా ల్గొని గ్రామ ప్రజల ఆరోగ్యంఆర్థికాభివృద్ధి కోసం అమ్మవారి కరుణ దృష్టి ఉండాలని కోరుకున్నారుఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మండల ప్రజలందరూ పాడిపం టలతోసుఖసంతోషాలతోవర్ధిల్లాలని అమ్మ వారు అందరిని కాపాడాలని కోరుకుంటు న్నానని తెలిపారు.ఆయనతోపాటు వివిధ గ్రామాల అమ్మవారి భక్తులునాయకులు స్థా నిక ప్రజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు



## శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్:

జమ్మికుంట పట్టణంలోని 24 వ వార్డు గణేష్ నగర్ లో రాజేష్ ఠాకూర్ రాకేష్ ఠాగూర్ ఆధ్వర్యంలో అదేవీ కర్ణ కటాక్షాలు మనందరి పైన ఉండాలని మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి , ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి , పట్టణ అధ్యక్షులు కోలకాని రాజు, ఆకుల రాజేందర్, మోతే స్వామి, కైలాస్కోటి గణేష్, ఠాకూర్ దేవా, ఠాకూర్ సచిన్ భక్తులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలి



### ... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వైద్య ఆరోగ్యశాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 29 అక్షరం న్యూస్**
ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు. సోమవారం లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్యశాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి ఆశా కార్యకర్తల ద్వారా ప్రసవానికి దగ్గర గా ఉన్న గర్భిణీ మహిళలను ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రెగ్నెన్సీ గుర్తింపు నుంచి ప్రసూతి వరకు అన్ని దశలలో ప్రభుత్వ వైద్య సహాయం పొందాలని, ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్, టీకాలు 100% జరిగేలా చూడాలని అన్నారు.ఆర్.బి.ఎస్.కే బృందాల పనితీరును పర్యవేక్షించాలని , పాఠశాలలను నిరంతరం తనిఖీ చేస్తూ పిల్లల ఆరోగ్య స్థితి గతులను రెగ్యులర్ గా చెక్ చేయాలని, అవసరమైన వారికి వైద్య చికిత్సలు అందజేయాలని అన్నారు.ఎన్.సి.డీ స్క్రీనింగ్ ప్రతి హెల్త్ సెంటర్ పరిధిలో పక్కాగా జరగాలని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు టీవీ అనుమానితులను గుర్తించి నిర్ధారణ పరీక్షలు చేయాలని అన్నారు. సబ్ సెంటర్ నిర్మాణ మరమ్మత్తు పనులు సకాలంలో పూర్తి కావాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణి శ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు, సంప్రదాయం -ఆధునికతకు మేళవింపు



సమాజానికి బతుకమ్మ సందేశం.

**సుల్తానాబాద్, అక్షరం న్యూస్ ప్రతినిధి, సెప్టెంబర్, 18 (మహమ్మద్ యూసుఫ్ అలీ)**
తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే అతి ప్రాచీన పండుగల్లో బతుకమ్మ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఈ పండుగ, ప్రకృతిని, పూలను, స్త్రీ శక్తిని స్మరించుకునే అద్భుతమైన ఆచారంగా నిలుస్తుంది. "బతుకు" అంటే జీవితం, "అమ్మ" అంటే తల్లి అనే అర్థంతో ప్రాణం, సృజన, స్త్రీత్వంను గౌరవించే పండుగగా బతుకమ్మ నిలుస్తుంది. బతుకమ్మలో ప్రధాన ఆకర్షణ వనమూలిక పూలు. గంగవెల్లి, బంతి, గున్నగ, చామంతి, తంగేడు, గులాబీ వంటి సుగంధ పుష్పాలతో స్త్రీలు అందంగా బతుకమ్మను అలంకరిస్తారు. ఈ పూలకు ఔషధ గుణాలు ఉండటమే కాకుండా, వర్షాకాలం ముగిసిన తర్వాత ప్రకృతి ఇచ్చే ఆరోగ్య పరిరక్షణలో ఇవి సహకరిస్తాయి. ఇది మన పండుగను పర్యావరణ పరిరక్షణతో అనుసంధానించే గొప్పతనం. బతుకమ్మ పండుగ స్త్రీల ఉత్సాహానికి ప్రతీక. అమ్మాయిలు, మహిళలు రంగురంగుల చీరలు ధరించి, సమూహంగా పాటలు పాడుతూ, బతుకమ్మ చుట్టూ నృత్యం చేస్తారు. ఈ వేడుకలో ఐక్యత, సోదరభావం, స్త్రీ సాధికారత ప్రతిధ్వనిస్తాయి. మహిళల ఆరాధన, వారి సృజనాత్మకతకు బతుకమ్మ ఒక అద్భుత వేదిక. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు, బతుకమ్మ పండుగ ఆధునికతను ఆహ్వానిస్తూ తన ప్రాముఖ్యతను పెంచుకుంది. ప్రభుత్వ స్థాయిలో కూడా పూల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ పండుగను తెలంగాణ ఆత్మగా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. విదేశాలలో కూడా తెలంగాణ ప్రజలు బతుకమ్మను జరుపుకుంటుండగా ఈ పండుగ సంప్రదాయం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించబడుతుంది. బతుకమ్మ పండుగ ప్రకృతిని ప్రేమించాలి, స్త్రీని గౌరవించాలి, ఐక్యతతో జీవించాలి అనే సందేశాన్ని అందిస్తుంది. ప్రకృతి, పర్యావరణాన్ని సంరక్షించడంలో



సమాజ కర్తవ్యాన్నికూడ గుర్తు చేస్తుంది. బతుకమ్మపండుగ, మన సంస్కృతికి అక్షయ చిహ్నం. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలా%౭% అంటూ ప్రతి హృదయంలో కొత్త ఆశలు, కొత్త బతుకులు పూయించే ఈ పండుగ ఎల్లప్పుడూ మన తెలంగాణ స్ఫూర్తిని నిలబెడుతుంది. బతుకమ్మ కేవలం పండుగ కాదు మన ప్రాంతీయ గౌరవం. మన సాంస్కృతిక వారసత్వాన్ని ఎలుగెత్తి చాటి భవిష్యత్ తరాలకు భక్తి, సాంస్కృతిక గుర్తింపును సజీవంగా అందచేసే గొప్ప సందేశం కూడ.

## నిరుపేద పెరాలసిస్ పేషెంట్ కు భరోసా నిత్యవసర వస్తువులతో చేయూత

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29**
**పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
గోదావరిఖని విటల్ నగర్ లో గత కొంతకాలంగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన కుడప పోషం పెరాల్సిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. తినడానికి తిండి లేక పడుకోవడానికి దిండు లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న విషయాన్ని తెలుసుకున్న భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు నసీమ దాతలు మంథని మండలంలోని అడవి సోమనపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ బాపన్న ఆర్థిక సహకారంతో పలువురు పుర ప్రముఖుల సమక్షంలో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులతో పాటు తన దీనావస్తాను చూసి చెలించి ఎయిర్ బెడ్ ను అందజేసి



మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం భరోసా ఆర్గనైజర్ నసీమ మాట్లాడుతూ నిరుపేద నిస్సహాయ కుటుంబానికి చెందిన కడప పోచం గత కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్న విషయం చాలా బాధాకరమని, తన దీన పరిస్థితిని తెలుసుకొని వారికి అండగా ఉండాలనే ఆలోచనతో బాపన్న ఆర్థిక సహాయంతో నిత్యావసర వస్తువులతో పాటు బెడ్ ని అందజేయడం జరిగిందని, మానవత్వంతో ముందుకు వచ్చి నిస్సహాయ కుటుంబానికి ఆర్థిక సహకారం అందించిన బాపన్నకి ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, అలాగే కుడుప పోచం అనారోగ్య పరిస్థితి కుదుటపడాలని మామూలు మనిషిగా బాగు కావాలని ఆ దేవుని కోరుకుంటున్నానని, నేను పిలవగానే మంచి మనసుతో విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపాటు. ఈ కార్యక్రమంలో భరోసా ఫౌండర్ నసీమతో పాటు రజియా, బాబు మియా, కుంట సది, మునక్కా, ప్రముఖ సంఘ సేవకులు బొల్లం మధు బాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఐజేయూ



**మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ సెప్టెంబర్ 29(అక్షరం న్యూస్)**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం జనం సాక్షి పాత్రికేయుడు, ఐజేయు జిల్లా నాయకుడు శెట్టి పరశురాములు వారి సతీమణి మౌనిక (పల్లవి) ఎంగిలిపూల బతుకమ్మ నాడు బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మృతి చెందారు టీయూడబ్ల్యూజే (ఐజేయు) కొత్తగూడ మండల కమిటీలి పక్షాన నేడు పరశురాములు కుటుంబానికి పరామర్శించి, ఓదార్చి మనో ధైర్యాన్ని కల్పించడంతోపాటు 150( క్వింటనర) కిలోల బియ్యాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) కొత్తగూడ మండల అధ్యక్షులు ఎస్ . కె .సల్మాన్ పాషా,మండల ఉపాధ్యక్షులు గోగు విజయ్ కుమార్,ప్రచార కార్యదర్శి తీగల ప్రేమ్ సాగర్, ముఖ్య సలాదారులు బొజ్జ సునీల్, రాజు కుమార్,దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతితో మానవ అనుబంధాన్ని గుర్తుచేసే పండుగ బతుకమ్మ

### - గోదావరి అంజిరెడ్డి





**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 29 అక్షరం ప్రతినిధి**
ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ప్రకృతిని ఆరాధించే అతిపెద్ద పండుగ బతుకమ్మ అని భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సురభి కాలనీలో బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భీమని విజయలక్ష్మి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని గుర్తుచేసే వినూత్నమైన పండుగ బతుకమ్మ అని అన్నారు. మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం మొదలైన అంశాలన్నింటినీ పాట రూపంలో ఆలపించే అద్భుత ఘట్టం బతుకమ్మ సొంతమని అన్నారు. ఈ పండుగ ఎలా మొదలైందో చెప్పడానికి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ బతుకమ్మ అంటే తెలంగాణ అస్తిత్వం అనడంలో మాత్రం అతిశయోక్తి లేదని అన్నారు. అనంతరం బతుకమ్మ వేడుకలో పాల్గొన్న మహిళలకు నిర్వాహకురాలు భీమని విజయలక్ష్మి పసుపు కుంకుమలతో పాటు చీరలను వాయినంగా అందజేశారు. తన ఆహ్వానాన్ని మన్నించి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ నాయకురాళ్లు రాధ మూర్తి, పద్మ, రేణుక, గాయత్రి, మహేశ్వరి, కాంచన కృష్ణ, వినీత సింగ్, స్నిగ్ధ తో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాత రూట్ లోనే మెట్రో రైలు సౌకర్యాన్ని కల్పించాలి..



**కొమిరిశెట్టి సాయిబాబా ను అరెస్ట్ చేసిన పోలీసులు**
శేరిలింగంపల్లి సెప్టెంబర్ 29 అక్షరం ప్రతినిధి రెండో దశ మెట్రో రద్దు చేసినందుకు నిరసనగా రెండో దశ మెట్రో శిలా ఫలకం వద్ద భారీగా బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన తెలియజేసిన శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా.. అందుకు గాను సాయిబాబా ని అరెస్ట్ చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నో ఆశలతో ఐటీ కారిడర్ నుండి మా ప్రాంతం ద్వారా శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు సౌకర్యాన్ని కల్పించారు, దీని ద్వారా అనేక ప్రాంతాలకు, మా ప్రాంతానికి మెట్రో ద్వారా ప్రయాణం సులభంగా మారుతుంది అని ఆశ పడ్డాము. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాలెడ్జి సిటీ నుండి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ మీదుగా కోకాపేట్ నీయోపోలీస్ వరకు మాత్రమే ప్రతపాదించడం విడ్డురం...అదే ఎయిర్పోర్ట్ కు సౌకర్యం కల్పించాలని నిరసన తెలియజేస్తూన్నాము. మళ్ళీ వచ్చేది మా బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పాత రూట్ లోనే మెట్రో రైలు సౌకర్యాన్ని కల్పించేలా చేస్తాం. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



**.....జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**లిలిరెవెన్యూ శాఖ సమీక్ష**
**నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్-29 అక్షరం న్యూస్**

భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి రెవెన్యూ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారం, భూ భారతి దరఖాస్తులు, ప్రజావాణి దరఖాస్తులు, మీ సేవా దరఖాస్తులు, పెండింగ్ భూ సేకరణ తదితర అంశాల పై కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల అర్హత ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణిత గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ , తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు బతుకమ్మ కానుక సత్యనారాయణ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం/చర్ల సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్/**

తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దేవతలను పూలతో పూజిస్తారు. కానీ పూలనే దేవతగా భావించి తెలంగాణ ఆడపడుచులు పూజించే పండుగ బతుకమ్మ. ప్రకృతి అందాలను పూల సౌందర్యాన్ని స్త్రీ శక్తి స్ఫూర్తిని ఐక్యత సౌభ్రాతృత్వం స్త్రీల గౌరవాన్ని ప్రతిబింబించే వేడుక బతుకమ్మ పండుగ. అటువంటి ప్రాముఖ్యత కలిగిన పూల పండుగకు పాకలపాటి సత్యనారాయణ రాజు బతుకమ్మ కానుకగా తేగడ గ్రామంలోని ఆడపడుచులు నిర్మించుకున్న మూడు బతుకమ్మ గద్దెలకు ఒక్కో గద్దెకు మూడు వేల రూపాయల చొప్పున కానుకను ఇచ్చి ఆడపడుచులను గౌరవించారు. పూల పండుగకు ఆడపడుచులకు బతుకమ్మ కానుకను అందించిన పాకలపాటి సత్యనారాయణ రాజుకు ఆడపడుచులు అభినందనలు తెలిపారు.

## కుల రహిత సమాజం కై పోరాడుదాం.......

### సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ పుల్లన్న.



ద

**మహబూబాబాద్ జిల్లా/గంగారం/ సెప్టెంబర్ 29(అక్షరం న్యూస్)**

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం లోనిజ్యోతిరావు పూలే సత్యశోధక్153 వ ఆవిర్భవ దినోత్సవంలో భాగంగా కామారం గ్రామంలో ధార రామస్వామి అధ్యక్షతన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పుల్లన్న మాట్లాడుతూ సమస్త సంపదను సృష్టించే శ్రామిక వర్గాలను కులాల వారీగా విభజించిన కుల వ్యవస్థను దానిని కాపాడుతున్న మనువాదాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో మహాత్మ జ్యోతిరావు పూలే.1873 సెప్టెంబర్ 24న సత్యశోధకు సమాజ్ ను స్థాపించారు. ఈ సంస్థ ఏర్పాటు కుల నిర్మూలన పోరాటంలో ఒక విప్లవత్మకమైన ముందడుగు సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావం మన దేశంలోనే ఎన్నెన్నో సంస్థలకు పార్టీలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా ఏర్పడి కొనసాగుతున్న కుల వ్యవస్థ దానికి అలంబనగా నిలుస్తున్న చందాన మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పుల్లన్న పిలుపునిచ్చారు ఈకార్యక్రమంలో కార్యకర్తలు (పజలు తదితరులు పాల్గొన్నారు

## ఐశ్వర్య మహిళా శక్తి కి ఐదు వేలు ఆర్థిక సాయం

### పాకలపాటి సత్యనారాయణ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం/చర్ల సెప్టెంబర్ 29/ అక్షరం న్యూస్/**

సేవ చేయాలనే సంకల్పం ఉంటే ఎన్ని అవరోధాలు ఎదురైనా అవి పూసుకు పుల్లతో సమానం అని నిరూపిస్తూ ఐశ్వర్య మహిళా శక్తి అసోసియేషన్ సభ్యులు ముందుకు దూసుకు పోతున్నారు. ఏ స్వార్థం లేకుండా సేవా కార్యక్రమాలు చేస్తూంటే గుర్తింపు దానంతట అదే వస్తుంది అని అనడానికి ఐశ్వర్య మహిళా శక్తి అసోసియేషన్ సభ్యులే అని అనడంలో అతిశయోక్తి లేదు. ఐశ్వర్య మహిళా శక్తి అసోసియేషన్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు ముగ్ధులై కమిటీ సభ్యులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని పాకలపాటి సత్యనారాయణ రాజు ఐశ్వర్య మహిళా శక్తి అసోసియేషన్ కు ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించి మంచి మనసును చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐశ్వర్య మహిళా శక్తి అసోసియేషన్ సభ్యులు తేగడ గ్రామం లో ప్రజాసేవ చేస్తూ దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతున్నారని ఆయన అన్నారు. భవిష్యత్ లో కూడా మంచి మంచి సేవా కార్యక్రమాలు చేయాలని వాటికి నావంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన అన్నారు.

## మహిళా ఉపాధ్యాయులకు సద్దుల బతుకమ్మ రోజే ఎన్నికల శిక్షణ ఇవ్వడం ఏంటి..

**అధికారుల వింత ప్రవర్తన తో బతుకమ్మ ఆడలేక**
**ఆవేదన చెందిన మహిళా ఉపాధ్యాయులు**
**ప్రభుత్వం బతుకమ్మ ఆడమని సెలవులిస్తే**
**అధికారులు శిక్షణ ఇవ్వడం ఏంటి..?ు**
**ఇది బతుకమ్మ పండుగ స్ఫూర్తికే విరుద్ధంు**
**ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యాన్ని సైతం**
**లెక్కచేయని అధికారులు**
**అధికారుల తీరు మారాలి.విచక్షణతో ఆలోచించాలి**
**తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం**
**మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ విమర్శ**



**మహబూబాబాద్ /కేసముద్రం**
**/సెప్టెంబర్ 29/అక్షరం న్యూస్ :-**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులైన మహిళా ఉపాధ్యాయులకు సైతం సోమవారం సద్దుల బతుకమ్మ రోజే ఎన్నికల సోమవారంశిక్షణ ఇవ్వడాన్ని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ఖండించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, మహిళలందరూ ఈ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారని ఆయన అన్నారు. ఈ పండుగ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిందని ఈ క్రమంలోనే మహిళా ఉపాధ్యాయులు అందరూ తమ అమ్మ గారి ఇంటికి వెళ్లి పండుగ సంబరాలు జరుపుకుంటున్న సందర్భంలోనే అధికారులు ఉన్నఫలంగా ఎన్నికల శిక్షణ నిర్వహించడం ఏంటి..? అని విమర్శించారు. మహిళా ఉపాధ్యాయులను బతుకమ్మ ఆడనీయకుండా వారిని మనోవేదనకు గురిచేయడం సమంజసం కాదని, ఇది బతుకమ్మ పండుగ స్ఫూర్తికే విరుద్ధమని అన్నారు. సోమవారం తప్ప అధికారులకు వేరే రోజు ఏది అనుకూలంగా కనిపించలేదా..? అని ప్రశ్నించారు. "దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యనట్లు " ఉంది అధికారుల ప్రవర్తన అని ఎద్దేవా చేశారు. అధికారులు విచక్షణతో ఆలోచించి ఉంటే బాగుండేదని,కనీసం ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యాన్ని పరిగణలోకి తీసుకున్నా ఈ శిక్షణ కార్యక్రమం తేదీ మారేదని, మహిళా ఉపాధ్యాయులు నష్టపోయే వారు కాదని, వారు మనోవేదనకు గురయ్యే వారు కాదని ఆయన ఆవేదన వ్యక్తం వారు. సంబంధిత అధికారులు భవిష్యత్తులోనైనా ఇలాంటి తప్పిదాలు చేయకుండా ఉండాలని అర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున వచ్చిన దసరా పండుగను అక్టోబర్ 3 వ తేదికి మార్చాలి

### – గనులు, డిపార్ట్మెంట్ లలో అధికారుల కు వినతి పత్రాలు ఇచ్చిన ఏఐటియుసి.

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**




సింగరేణి లో దసరా పండుగ సెలవు ను అక్టోబర్ 2 కు బదులుగా 3 కు మార్చాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆద్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్స్ , ఓసిపి 5 లలో అధికారుల కు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను లు పేర్కొన్నారు. సోమవారం జిడికె 2వ ఇంక్లైన్ లో మరియు ఏరియా హాస్పిటల్ లలో వారు అధికారుల కు వినతి పత్రాలు ఇచ్చిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే దసరా పండుగ జాతిపిత మహాత్ముడైన గాంధీ జయంతి అక్టోబర్ 2న రావడం దసరా పండుగను అత్యంత వైభవంగా సింగరేణి ఉద్యోగులు జరుపుకొనుటకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. పండుగ రోజున గనుల పైన మేకలతో మైసమ్మ పూజలు చేస్తూ సంవత్సర కాలమంతా నిర్దేశిత లక్ష్యసాధనలో మాకు ఎటువంటి ప్రమాదములు జరగరాదని భావోద్వేగంతో, భక్తి పారవశ్యంతో అమ్మవారిని కోరుకుంటారని వారు తెలిపారు. ఆ సందర్భంగా అమ్మవారి మొక్కు తీర్చునప్పుడు మద్యం ప్రధాన భూమిక పోషిస్తుందని , పూజకు సంబంధించిన అవసరమైన ప్రధాన వనరులు అక్టోబరు రెండు తారీకున మహాత్మాగాంధీ జయంతి కారణంగా నిషేధించ బడినవని వారు తెలిపారు. అందువల్ల ఉద్యోగుల కోరికను మన్నించి యాజమాన్యం సహృదయంతో ఆలోచించి కార్మికుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని అక్టోబర్ 2 తారీఖున వచ్చిన దసరా పండుగను అక్టోబర్ 3వ తారీకు కు మార్చాలని సింగరేణి లో కార్మిక వర్గం కోరుతున్నారని వారు తెలిపారు. ఇట్టి విషయం లో సింగరేణియులందరూ కూడా యాజమాన్యం కు ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా లేదా వారికి అవకాశం ఉన్న అన్ని సందర్భాలలో దసరా పండుగ తేది ని మార్చాలని యాజమాన్యం దృష్టికి తీసుకరావడం జరిగిందని వారు పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి గుర్తింపు సంఘంగా ఇదివరకే ఉద్యోగుల మనోభావాలను, భక్తి పారవశ్యాలను దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం కు లిఖిత పూర్వకంగా తెలియజేయడం జరిగిందని , దసరా సమీపిస్తున్న వేళ మరొకసారి ఉద్యోగుల మనోభావాలను దసరా పై ఉద్యోగులకు ఉన్న మక్కువను యాజమాన్యం దృష్టికి మరొకసారి విజ్ఞాపన పత్రాల ద్వారా అన్ని గనులు, డిపార్ట్మెంట్ల ఉద్యోగుల ద్వారా పంపిస్తున్నామని వారు తెలిపారు. యాజమాన్యం ఉద్యోగులకు ఇచ్చిన నిర్దేశిత లక్ష్యాలను గత దశాబ్దాల కాలము నుండి ఏనాడు ఏమర పాటు కూడా నిర్లక్ష్యం చేయకుండా సాధిస్తున్నారని వారు తెలిపారు. ఈ సంవత్సరం కూడా నిర్దేశిత లక్ష్యాలను సాధించుటకు ఉద్యోగులందరూ కంకణ బద్ధులై ఉన్నారని, ఇప్పటికే కోల్ ఇండియాలో వివిధ రాష్ట్రాలలో ఉన్న బొగ్గు సంస్థలు దసరా తేదీని మార్చుతూ నిర్ణయం తీసుకున్నారని వారు గుర్తు చేశారు. ఇట్టి అవకాశం యాజమాన్యం కల్పించినట్లయితే ఉద్యోగులకు కూడా సంస్థ పైన విశ్వాసం పెరిగి పరస్పర అవగాహనతో ముందుకు వెళుతూ నిర్దేశిత లక్ష్యసాధనలో అన్ని వర్గాల ఉద్యోగులు మమేకమై ఉంటారని వారు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, ఉప్పులేటి తిరుపతి,పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, అజీం పాషా, ఎరవెల్లి రాజయ్య, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి, నాయిని శంకర్, గొడిశల నరేశ్, ఎం.చక్రపాణి, చెప్యాల భాస్కర్, బలుసు రవి, దొంత సాయన్న, బండి మల్లేష్ బి.సమ్మయ్య, దాసరి శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్, ఆర్ వెంకట స్వామి, ఎం.సత్యనారాయణ, దాసరి అనిల్, సంతోష్, బి.శ్రీరాములు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

### – బిఆర్ఎస్ పార్టీ గంగారం మండల అధ్యక్షులు ఇర్ప సూరయ్య

**మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ సెప్టెంబర్ 29(అక్షరం న్యూస్)**



రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనకు పతనం మొదలైంది కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం గా ఉన్నారు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో దేశానికే అదర్శంగా రాష్ట్రాన్ని నిలబెట్టారని అన్నారు ఆరు గ్యారెంటీ లు 420హామీలను అమలు చేసే దమ్ము లేకనే కేసీఆర్ పై రేవంత్ రెడ్డి నిత్యం నోరు పారేసుకుంటున్నారు స్థానిక సంస్థ ఎన్ని కల్లో ఓడిపోతామనే భయంతో నే ఎన్నికలు నిర్వహించడం లేదు ప్రజలకు ఇచ్చిన హామీలైన రైతులకు బీమా సౌకర్యం కూడా కల్పించడం లేదు పింఛన్ రూ 4 వేలకు పెంపుఆడబిడ్డలకు స్కూటీలు మహిళలకు రూ 2500 హామీలు ఎటుపోయాయి కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది కాంగ్రెస్ చేస్తున్న మోసాలను బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించారు బీఆర్ఎస్ ప్రభుత్వంతో నే అభివృద్ధి సాధ్యమనే విషయాన్నిప్రజలకు తెలియజేయాలి వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

# జీ.ఓ. నెంబర్ 12 ను సవరించాలి

### బిబిఎస్.రామ్మోహన్, రాష్ట్ర అధ్యక్షులు.



**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

సీఐటీయూ అనుబంధ పెద్దపల్లి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 4వ మహాసభలు ఆదివారం శ్రామిక భవన్ సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుఎస్.రామ్మోహన్ గారు హాజరయ్యారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు.అందులో ప్రధానంగా భవన నిర్మాణ కార్మికుల చట్టాలు అయిన కేంద్ర కార్మిక చట్టం, అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టాలను4 లేబర్ కోడ్ లలో కలిపారని అన్నారు. సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతర శాఖలకు మళ్లిస్తున్నారని అన్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నారు అన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు.అనంతరం జిల్లా నూతన కమిటీనీ ఎన్నుకోవడం జరిగింది.పెద్దపల్లి జిల్లా నూతన కమిటీ ఎంపిక.. జిల్లా నూతన అధ్యక్షకార్యదర్శులుగా తుంగపిండి మల్లేష్, వేల్పుల కుమారస్వామి, కోశాధికారిగాగుండు కనుకయ్య, ఉపాధ్యక్షులుగాగౌరక్కగారి శ్రీనివాస్,సరిగొమ్ముల మధు, మురుకుంట్ల భారతి, కె .సదానందం,మంథని సమ్మయ్య, సహయ కార్యదర్శులుగాసీపెల్లి రవీందర్,రాసపెల్లి పరమేష్, విజయలక్ష్మీ, బెక్కెం స్వామి,ఎం.కొమురయ్యకమిటీ సభ్యులుగా మహేందర్,మేకల శేకర్,బంగారి మోహన్, వై.సత్యనారాయణ,పోచం,అశోక్,రాజయ్య,అంజయ్య,హరీష్,జక్కుల రాజయ్య,కాసగాని అశోక్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు



# ఎన్టీఆర్ చౌరస్తా లో పండుగ పూట ఐనా ట్రాఫిక్ ని చక్కదిద్దే వారేరి?

**–చొప్పదండి ఎన్టీఆర్ చౌరస్తా లో బతుకమ్మ పండుగ**
**–రోజున విపరీతమైన జన సందోహం**
**–బతుకమ్మ పండుగ పూలు,, ఇతరత్ర వస్తువులు**
**–కొరకు మండలం మొత్తం ఎన్టీఆర్ చౌరస్తా కు రాక**
**–ట్రాఫిక్ అదుపుకి ఎలాంటి ఏర్పాటు చెయ్యని పోలీస్ శాఖ**
**–కనీసం పోలీస్ శాఖ వారికి సూచననో, సలహా నో లేదా ట్రాఫిక్ అదుపు చేసే ఏర్పాటు కొరకు ఒత్తిడి**
**–తీసుకురాని చొప్పదండి పట్టణ రాజకీయ నాయకులు అని అంటున్న ప్రజలు**
**ఇప్పటికీ అయినా రాజకీయ నాయకులు చొరవ తీసుకోవాలి అని అంటున్న ప్రజలు**
**–పోలీసు శాఖ వారు కూడా వెంటనే తగు ఏర్పాట్లు చేయాలి అని అంటున్న ప్రజలు**

**చొప్పదండి /కరీంనగర్, సెప్టెంబర్( 29 అక్షరం న్యూస్ )**

చొప్పదండి పట్టణం లోని ఎన్టీఆర్ చౌరస్తా లో సోమవారం రోజున బతుకమ్మ పండుగ సందర్భంగా విపరీతమైన రద్దీ ఏర్పడింది. చొప్పదండి పట్టణం తో పాటు, మండలం లోని ప్రజలు ముఖ్యం గా బతుకమ్మ కొరకు ఉపయోగించే తంగేడు పూలు, గునుగు పువ్వు, చెమంతి పువ్వు, పట్టు కుచ్చు పువ్వు, ఇతరత్ర పూలు, ఇతర సామాగ్రీ కొరకు ఎన్టీఆర్ చౌరస్తా కు రావటం వలన జన సమ్మర్ధ్యం ఎక్కువ అయింది గత నాలుగు రోజుల నుంచే ఎన్టీఆర్ చౌరస్తా లో జన సమ్మర్థ్యం పెరిగింది. పూలు, ఇతరత్రా అమ్మే వారు కూడా ఎన్టీఆర్ చౌరస్తా లో అమ్మితేనే ప్రజలు ఎక్కువగా రావటం వలన అమ్మకాలు బాగుంటాయాని ఎన్టీఆర్ చౌరస్తా లోనే తమ దుకాణం లను రోడ్డు మీద ఏర్పాటు చేసుకున్నారు అలాగె ఎన్టీఆర్ చౌరస్తా లో బట్టల దుకాణం లు, మహిళలకు సంబందించిన బ్యాంగిల్స్ స్టోర్స్ ఉండటం పురుషులు, పిల్లల డ్రెస్సెస్ ఉండటం, కిరాణా దుకాణం లు ఉండటం వలన కూడా చొప్పదండి పట్టణం, మండలం లోని ప్రజలందరూ ఎన్టీఆర్ చౌరస్తా కె వస్తారు.

దీనివలన ఎన్టీఆర్ చౌరస్తా లో గత నాలుగు రోజులుగా విపరీతమైన రద్దీ ఏర్పడుతుంది ముఖ్యం గా సోమవారం రోజున బతుకమ్మ పండుగ రోజున విపరీతమైన జన సమ్మర్థ్యం తో విపరీతమైన ట్రాఫిక్ అయింది.విపరీతమైన ట్రాఫిక్ అయినప్పటికి పోలీస్ శాఖ వారు ఎలాంటి ఏర్పాటు చేయకపోవటం వలన వాహనం %శ్రీబ% అస్తవ్యస్టంగా ఇస్తారీతిన వెళ్ళటం తో ప్రజలు ఇబ్బందులకు గురి అయినారు. ఇంత ట్రాఫిక్ వున్నప్పుడు పోలీస్ శాఖ వారు ట్రాఫిక్ ని అదుపులో ఉంచేందుకు ఒక ఇద్దరు కానిస్టేబుల్ లను ఎన్టీఆర్ చౌరస్తా లో అందుబాటులులో ఉంచితే చాలా మట్టుకు ట్రాఫిక్ అదుపులో ఉండేది. కానీ పోలీస్ శాఖ వారు అలాంటి ఏర్పాటు ఏదీ కూడా చెయ్యలేదు.

ప్రతీ రోజు ఎన్టీఆర్ చౌరస్తా లో పోలీస్ శాఖ వారు ట్రాఫిక్ అదుపుకి ఏర్పాటు చేయల్సిన పోలీస్ శాఖ వారు కనీసం దసరా పండుగ ముందు నుంచి అనగా గత నాలుగు రోజుల నుంచి ముఖ్యం గా సోమవారం వారం రోజున బతుకమ్మ పండుగ రోజున ట్రాఫిక్ అదుపుకి ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవటం ఏమిటని ప్రజలు అనుకుంటున్నారు. అదేవిదంగా రాజకీయ పార్టీ నాయకులు అయినా పోలీస్ వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చి ఎన్టీఆర్ చౌరస్తా లో ప్రతీ రోజు ట్రాఫిక్ అదుపుకి పోలీస్ శాఖ వారు ఏదయినా ఏర్పాటు అనగా పోలీస్ క్యాబిన్ లేదా పోలీస్ ఔట్ పోస్ట్ లాంటి ఏర్పాటు చేసే విధంగా, మరీ ముఖ్యం గా ముఖ్యమైన పండుగరోజుల్లో కూడా ఎటువంటి ఏర్పాట్లు చేయించకపోవటం పై పట్టణ రాజకీయ నాయకులను కూడా ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక ముందు అయినా ప్రతీ రోజు ఎన్టీఆర్ చౌరస్తా లో ట్రాఫిక్ అదుపుకి పోలీస్ శాఖ వారు ఏర్పాటు చెయ్యాలని, ఒకవేళ పోలీస్ శాఖ వారు అలాంటి ఏర్పాటు చెయ్యకపోతే చొప్పదండి పట్టణం లోని అన్ని పార్టీ ల రాజకీయ నాయకులు వారి వారి రాజకీయ పార్టీలకు అతీతంగా పోలీస్ శాఖ వారికి సలహా రూపంలోనో, లేదా సూచనగానో ఏర్పాటు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.పోలీసు శాఖ వారు కూడా వెంటనే తగు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.





# ఆరోగ్యం- మహాభాగ్యం

## వానాకాలంలో బోడకాకర కూర తింటే ఎన్ని ప్రయోజనాలో తెలుసా..?



బోడ కాకరకాయ  చూడటానికి గుండ్రంగా, ఆకుపచ్చగా, దానిపైన సుతిమెత్తని పిలకలతో ఉంటుంది. ఈ బోడ కాకరకాయలతో కూర వండితే వచ్చే రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే. అయితే బోడ కాకరకాయ కూరతో రుచి మాత్రమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలు ( ఉన్నాయి. ముఖ్యంగా వానాకాలంలో బోడకాకర కాయ కూర తినడంవల్ల ఆరోగ్యపరమైన లాభాలు చాలా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..బోడ కాకరకాయను ఆరోగ్యపరంగా ఉత్తమమైన కూరగాయల్లో ఒకటిగా చెప్పవచ్చు. ఎందుకంటే చికెన్, మటన్ లాంటి మాంసాహారాల్లో కూడా లభించని పోషకాలు బోడకాకరకాయలో లభిస్తాయి. మరీ ముఖ్యంగా వర్షకాలంలో ఈ పోషకాల మోతాదు ఎక్కువ. అందుకే వర్షాకాలంలో బోడ కాకర తినడంవల్ల వైరల్ ఇన్ఫెక్షన్‌లు దరిచేరవట. బోడకాకరలో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అందుకే ప్రతి ఒక్కరూ తమ డైట్‌లో బోడకాకరను చేర్చుకోవాలని నిపుణులు చెబుతుంటారు.బోడ కాకరలో ఆరోగ్యానికి అవసరమైన విటమిన్స్, అమైనో ఆమ్లాలు, ఫ్లేవనాయిడ్స్, పోటాషియం, ఫాస్పరస్ లాంటివి ఉంటాయి. అందుకే వర్షకాలంలో తప్పకుండా బోడకాకరను తినాలని అంటారు. డయాబెటిస్ ఉన్నవారు కూడా వర్షాకాలంలో బోడ కాకరకాయ తినడంవల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. బోడకాకరలో గ్లైసెమిక్ తక్కువగా ఉండటంవల్ల మధుమేహులకు మేలు చేస్తుంది. బోడకాకరలో విటమిన్ సీ కూడా పుష్కలంగా ఉంటుంది. అదేవిధంగా ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్, ఫాస్పరస్ లాంటి వాటిని ఎక్కువ మోతాదులో కలిగి ఉంటుంది. అందుకే బోడ కాకరను తరచూ తినడంవల్ల క్యాన్సర్ లాంటి సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. అంతేగాక బోడకాకర రక్తపోటు ప్రమాదాన్ని కూడా తగ్గిసుంది. గుండె సమస్యలను కూడా దరిచేరనివ్వదు.బోడ కాకరలో విటమిన్ సీతోపాటు కాల్షియం కూడా పుష్కలంగా ఉంటుంది. దాంతో ఇది ఎముకల బలోపేతానికి బాగా పనిచేస్తుంది. బోడకాకరను వర్షాకాలంలో తినడంవల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు, జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్స్ లాంటి వాటి నుంచి రక్షణ కలుగుతుంది. బోడ కాకరలో ఎక్కువ మోతాదులో పొటాషియం ఉండటంవల్ల రక్తపోటును నియంత్రిస్తుంది. అందుకే బీపీ రోగులకు ఇది మంచి ఔషధమని చెప్పవచ్చు.బరువు తగ్గాలనుకునే వారికి కూడా బోడ కాకర చాలా మంచిది. ఈ బోడకాకరను ప్రతిరోజూ తినడంవల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ఎందుకంటే బోడ కాకరలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. దాంతో దీన్ని తరచూ తీసుకోవడంవల్ల త్వరగా కడుపునిండిన భావన కలిగి ఆకలిని నియంత్రిస్తుంది. ఫలితంగా జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది.

## రోజుకు ఎన్నిసార్లు భోజనం చేస్తే ఆరోగ్యానికి మంచిది..?



ఏనం ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం ఎంత ముఖ్యమో.. వేళకు తినడం కూడా అంతే ముఖ్యం. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్లు  మినరల్స్ (%వీఱఅవతీఝశ్రీం%), ఫైబర్ (%ఖీఱఎవతీ%) లాంటి వాటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం చాలా అవసరం. ఇక రోజుకు ఎన్నిసార్లు తినాలనేది సాధారణ అంశం. దీనికి ఒక ప్రామాణికం అంటూ ఏమీ ఉండదు. నిజానికి రోజుకు ఎన్నిసార్లు తినాలనేది వ్యక్తుల శారీరక స్థితినిబట్టి వేర్వేరుగా ఉంటుంది.సాధారణంగా అయితే ఒక ఆరోగ్యవంతమైన వ్యక్తి ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా ఆహారం తీసుకోవడం సముచితమని వైద్యులు చెబుతున్నారు. అయితే సాధారణ బరువు కంటే తక్కువ ఉన్నవారు, ఏదైనా శారీరక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నవారు రోజుకు నాలుగుసార్లు తినడం మంచిదని అంటున్నారు. డయాబెటిక్ పేషెంట్లు కూడా రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఎందుకంటే వారు ఎక్కువసేపు ఆకలితో ఉంటే సమస్య మరింత పెరుగుతుందని అంటున్నారు.అదేవిధంగా ఊబకాయంతో బాధపడేవారు లేదా సాధారణం కంటే ఎక్కువ బరువు ఉన్నవారు రోజుకు రెండు లేదా మూడుసార్లు తిన్నా తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిదని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఇక ఎవరైనా సరే ఆహారంలో అన్ని పోషకాలు సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఉదయం అల్పాహారంలో ప్రొటీన్లు, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం తక్కువ కేలరీల ఆహారం, సాయంత్రం త్వరగా జీర్ణమయ్యే ఆహారాలను తీసుకోవాలని అంటున్నారు.అయితే వ్యక్తులు వారి శారీరక స్థితిని బట్టి రోజుకు ఎన్నిసార్లు తినాలో నిర్ణయించుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఎన్నిసార్లు తీసుకున్నప్పటికీ ప్రతిరోజు నిర్ణీత సమయాన్ని పాటించడం మేలని అంటున్నారు. ప్రతిరోజూ నిర్ణీత సమయంలో తినడంవల్ల జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేస్తుందని చెబుతున్నారు.

## జీడిపప్పును రోజూ అసలు ఎంత మోతాదులో తినాలి..?



ఎ జీడిపప్పును చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. దీన్ని అనేక మసాలా వంటల్లోనే కాక తియ్యని వంటకాల్లోనూ వేస్తుంటారు. జీడిపప్పు వల్ల వంటకాలకు చక్కని రుచి వస్తుంది. అయితే జీడిపప్పును తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం చాలా మందికి తెలుసు. కానీ ఈ పప్పును తింటే బరువు పెరుగుతామని భయపడుతుంటారు. జీడిపప్పును వాస్తవానికి ఎక్కువగా తినాల్సిన పనిలేదు. దీన్ని రోజూ గుప్పెడు మోతాదులో లేదా 30 గ్రాముల మేర తింటే చాలు, ఎన్నో లాభాలు కలుగుతాయి. గుప్పెడు జీడిపప్పును తింటే సుమారుగా 160 క్యాలరీల శక్తి లభిస్తుంది. 12 నుంచి 13 గ్రాముల మేర ఆరోగ్యకరమైన కొవ్వులు, 5 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. అలాగే 9 గ్రాముల పిండి పదార్థాలు కూడా అందుతాయి. జీడిపప్పులో విటమిన్లు కె, బి6, బి1, బి3, బి9 వంటి అనేక రకాల విటమిన్లు లభిస్తాయి. ఈ పప్పులో విటమిన్ ఇ ఉంటుంది. ఇది  శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేస్తుంది.గుండె ఆరోగ్యానికి..జీడిపప్పులో అనేక రకాల మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా కాపర్, మెగ్నిషియం, జింక్, ఐరన్, ఫాస్ఫరస్, మాంగనీస్, సెలీనియం అధికంగా ఉంటాయి. జీడిపప్పులో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తాయి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ ముప్పు నుంచి సురక్షితంగా ఉండవచ్చు. జీడిపప్పులో మెగ్నిషియం, ఫాస్ఫరస్, కాపర్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచుతాయి. ఆస్టియోపోరోసిస్ రాకుండా రక్షిస్తాయి. ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.రోగ నిరోధక వ్యవస్థకు..జీడిపప్పులో జింక్ అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థకు చెందిన కణాలు నిర్మాణం అయ్యేలా చేస్తుంది. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. జీడిపప్పులో ప్రోటీన్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఈ పప్పు క్యాలరీలను అధికంగా ఇస్తుంది కానీ ఇది తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటుంది. అందువల్ల జీడిపప్పును తింటే షుగర్ లెవల్స్ పెరగవు. పైగా ఇందులో ఉండే మెగ్నిషియం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత మెరుగ్గా వాడుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారికి కూడా జీడిపప్పు మేలు చేస్తుంది. ఇందులో ఉండే ప్రోటీన్ల కారణంగా వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఫలితంగా ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.మెదడు ఆరోగ్యానికి..జీడిపప్పులో కాపర్, ఐరన్, జింక్ అధికంగా ఉండడం వల్ల ఇవి మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. నాడీ మండల వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. యాక్టివ్‌గా ఉంటారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. చిన్నారులకు రోజూ ఈ పప్పును తినిపిస్తే వారి మెదడు వికసిస్తుంది. ప్రతిభావంతులుగా మారుతారు. చదువుల్లో రాణిస్తారు. జీడిపప్పులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగానే ఉంటాయి. ముఖ్యంగా ఫినోలిక్ లిపిడ్స్, టోకోఫెరాల్స్, ఫైటో స్టెరాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో ఫ్రీ ర్యాడికల్స్ వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి సురక్షితంగా ఉండవచ్చు. ఇలా జీడిపప్పును రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## షుగర్ పేషెంట్స్.. ప్రతి రోజు చపాతీలు తినడం ఆరోగ్యానికి మంచిదేనా..?



ఇటీవలి కాలంలో చాలా మంది ప్రధానంగా డయాబెటిస్ బారిన పడుతున్నారు. అదేనండి.. షుగర్ బారిన. ఈ వ్యాధి బారిన పడ్డ బాధితులు ఆహారపు అలవాట్లను లు కావొచ్చు. మరి షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి రోజు చపాతీలు తినడం ఆరోగ్యానికి మంచిదేనా..? అనే విషయం తెలుసుకుందాం.

అన్నంతో పోల్చితే.. చపాతీలు డయాబెటిస్ రోగులకు మంచిదని చెప్పొచ్చు. ఎందుకంటే చపాతీల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సో చపాతీలు రక్తంలో షుగర్ లెవల్స్‌ను నెమ్మదిగా పెంచుతాయని చెబుతున్నారు. కాబట్టి డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించాలనుకునే వారికి చపాతీలు మంచిదే అని సూచిస్తున్నారు. రక్తంలో గ్లూకోజ్, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది కాబట్టి.. ప్రతి రోజు చపాతీలు తినడం వల్ల లాభాలే ఉన్నాయని చెబుతున్నారు.

మలబద్ధకం నివారణకు..రక్తంలో గ్లూకోజ్, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడమే కాదు.. మలబద్ధకం నివారణకు కూడా చపాతీలు ఉపయోగపడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చపాతీలకు ఉపయోగించే గోధుమ పిండిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. దీంతో మలబద్ధకం నివారించడంతో పాటు పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

బరువు నియంత్రణకు..బరువు నియంత్రణకు కూడా చపాతీలు దోహదపడుతాయి. ఒక చపాతీలో సుమారు 70 నుంచి 100 కేలరీలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చపాతీలో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల కడుపు నిండినట్లు అనిపిస్తుంది. తద్వారా ఆకలి వేయదు. దీంతో బరువు తగ్గేందుకు కూడా చపాతీలు సహాయపడుతాయి.

## స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాల్లో బస్టాండ్ పక్కన సానిటేషన్ డ్రైవ్






జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని బస్ స్టాండ్ ప్రక్కన ఉన్న నైట్ షెల్టర్ ముందు శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. పిచ్చి మొక్కలు తొలగించి శు భ్రం చేసి బ్లీచి%శీ%గ్ చల్లారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి, సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ , ఎకో వారియర్స్ ప్రతినిధి కరుణాకర్ ,మెప్మా సి ఓ ప్రియదర్శిని, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు

## అసిస్టెంట్ రిజిస్టార్‌గా శ్రావణి ఎంపిక



జనగామ జిల్లా/రఘునాధపల్లి/( అక్షరం న్యూస్)సెప్టెంబరు 29: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మండలంలోని కోమల్ల రైతు మల్లారెడ్డి కుతూరు కంసాని శ్రావణి గ్రూప్-2 లో సత్తా చాటి కో-అపరేటివ్ సొసైటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా ఎంపికయ్యారు. అంతకు ముందు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేసుకుంటూ గ్రూపు-2 ఎగ్జామ్ రాసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాకు పుట్టుకతో వినికిడి సమస్య ఉండేది.. నాతో ఎవ్వరు సరిగా మాట్లాడే వాళ్లు కాదు..దీంతో ఎన్నో అవమానాలకు గురయ్యాను. దీంతో ఎలాగైనా చదివి ఉన్నత ఉద్యోగం సాధిం చాలని నిర్ణయించకొని పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాను.

## 19వ గ్లోబల్ కమ్యూనికేషన్ కాన్ఫరెన్స్‌లో ఎన్‌టిపిసి 127 అవార్డులు




జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గోవాలో సోమవారం నిర్వహించిన 19వ గ్లోబల్ కమ్యూనికేషన్స్ కాన్ఫరెన్స్‌లో ఎన్‌టిపిసి లిమిటెడ్ 127 అవార్డులను గెలుచుకుని రికార్డ్ సృష్టించింది. ఈ విజయాలలో 14 బంగారు, 28 వెండి, 42 కాంస్య, 43 కన్సోలేషన్ అవార్డులు ఉన్నాయి. అదనంగా, ప్రతిష్ఠాత్మకమైన 'చాంపియన్స్ ఆఫ్ ఛాంపియన్స్' ట్రోఫీకి ఎన్‌టిపిసి 1వ రన్నరప్‌గా ఎంపికైంది. ఇవాటిలో, ఎన్‌టిపిసి తాల్చేర్ కనిహా రెండు రజత అవార్డులు అందుకుంది %-% ఒకటి కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎక్సలెన్స్ విభాగంలో, మరొకటి కార్పొరేట్ ఫిల్మ్ విభాగంలో.
ఎన్‌టిపిసి గెలుచుకున్న అవార్డులు మానవ వనరుల పద్ధతులు, సమాజ అభివృద్ధి, %జూ=% ప్రాజెక్టులు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఉద్యోగుల నిశ్చితార్థం మరియు కార్పొరేట్ కమ్యూనికేషన్ ప్రచారాలు వంటి విభిన్న రంగాలను కవర్ చేశాయి. భారతదేశంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పవర్ యుటిలిటీగా ఉన్న ఎన్‌టిపిసి ప్రస్తుతం 83 గిగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదనంగా, 2032 నాటికి 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

## ఓటర్ల ప్రత్యేక సవరణను వ్యతిరేకించిన కేరళ అసెంబ్లీ

తిరువనంతపురం, సెప్టెంబర్29 ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న క్రమంలో.. ఆ రాష్ట్రంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ కలిసి అందుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానానికి ప్రతిపక్ష కూటమి మద్దతు తెలిపింది. దాంతో తీర్మానం ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందింది.

# ఎన్టిపిసి ఏరియాలో శరన్నవరాత్రు ఉత్సవాలలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే





జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కృష్ణనగర్‌లో నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. సరస్వతి దేవి మాత రోజున ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించబడగా, ఆయన దేవి దర్శనం చేసుకొని ఆశీర్వాదాలు పొందారు. తరువాత ఎన్‌టిపిసి పరిధిలో హిందూ యువవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన దుర్గామాత ఆశీర్వాదాలతో ప్రజలందరికీ సుఖసమృద్ధులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ నవరాత్రులు భక్తి, శక్తి, సాంప్రదాయం, సాంస్కృతిక విలువలకు ప్రతీక అని, ఇలాంటి పూజలు సమాజంలో ఐక్యత, సత్సంకల్పం పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పండుగల్లో పాల్గొని శుభకాంక్షలు అందుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలలో స్థానిక నాయకులు, ఏ బి స రెడ్డి రాజు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, హిందూ యువవాహిని నాయకులు, మహిళలు, యువత, పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని



అలంకరించారు.

## అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), సెప్టెంబరు 29: తొమ్మిది రోజుల పాటు ఆటా..పాటలతో సాగిన బతుకమ్మ వేడుకలు సోమవారం సద్దుల బతుకమ్మ పర్వంతో ముగిశాయి. మండలంలో ఆనందోత్సహాల మధ్య మహిళలు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సద్దుల బతుకమ్మ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ ఆధ్వర్యంలో రంగు రంగుల విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలోనే ఏర్పాటు చేసిన కృ త్రిమ కుంట పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని ఖిలాషాపూర్, కంచనపల్లి, కోమల్ల, వెల్ది, నిడిగొండ, ఆశ్వరావుపల్లి, కుర్చపల్లి తదితర గ్రామాలలో ఇంటింటి సద్దుల జాతర ఊరంతా మైదానమైంది. మండల కేంద్రంలో సుమారు రెండు గంటల పాటు మహిళలు బతుకమ్మ ఆటను ఉత్సహంగా ఆడి అనంతరం బతుకమ్మలను కృత్రిమ కుంటలో నివ జ్జనం చేసి...మా తల్లి బతుకమ్మ పోయి రావమ్మా.. అంటూ వీడ్కోలు పలికారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



# ఆర్ జి వన్ సింగరేణి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు .. హాజరైన ఎమ్మెల్యే దంపతులు





జ్యోతి నగర్ ఎన్టిపిసి, సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం ఆర్‌జీ-1 ఏరియాలో సద్దుల బతుకమ్మ సంబురాలను సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆర్‌సిఒఏ క్లబ్‌లో జరిగిన ఈ వేడుకలకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-1 ఏరియా జీఎం డి.లలిత్‌కుమార్, సేవా సమితి అధ్యక్షురాలు డి.అనిత లలిత్‌కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ %-% "బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక ప్రత్యేకతకు ప్రతీక. రాష్ట్రవ్యాప్తంగా ఈ పండుగను ఘనంగా జరుపుకోవడం ప్రతి తెలంగాణవాసి గర్వించదగిన విషయం. సింగరేణి ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు అట్టహాసంగా



జరగడం విశేషం" అన్నారు.
వేడుకల్లో సంప్రదాయ బద్ధంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు ఆకర్షణీయంగా అలంకరించగా, ప్రధాన అతిథులు బహుమతులు అందజేశారు.
కార్యక్రమంలో కార్పొరేటర్ మాజీ మహంకాళి స్వామి, ఏసీపీ మడత రమేష్, కాంగ్రెస్ నాయకుడు ఎం.డి.ముస్తఫా, ఏఐటీయూసీ నాయకుడు రంగు శ్రీను, సిఎంఓఏఐ మల్లేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారులు రమేష్, చిలక శ్రీనివాస్, వేణు, శ్రావణ్, హనుమంతరావు, జితేందర్ సింగ్, వరప్రసాద్, మహిళా సంఘ సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# దుర్గా నగర్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు







జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పెద్దపల్లి జిల్లా రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ గారు గోదావరిఖని దుర్గ నగర్‌లో జరిగిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.కాలనీవాసులతో కలిసి బతుకమ్మ పండుగలో ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక మహోత్సవమని, ప్రపంచానికి తెలంగాణ ప్రత్యేకతను పరిచయం చేస్తోందని అన్నారు.మనాలి ఠాకూర్ మహిళలతో కలిసి బతుకమ్మ చుట్టూ తిరిగి ఐక్యత, సాంప్రదాయ విలువలను ఈ పండుగ ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. కాలనీవాసులు ప్రాంత సమస్యలను వివరిస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.పెద్ద సంఖ్యలో మహిళలు, పిల్లలు, యువతీ యువకులు పాల్గొని దుర్గ నగర్‌లో ఉత్సవ వాతావరణాన్ని నెలకొల్పారు.

# గౌతమి నగర్ చైతన్యపురి కాలనీలో హైమాస్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే





జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని గౌతమ్ నగర్, చైతన్యపురి కాలనీ మరియు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్స్‌ను. సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు టి యు ఎఫ్ ఐ డి సి నిధుల సహకారంతో చేపట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజలకు మరింత వెలుగు, రహదారులపై భద్రత కల్పించడం, రాత్రి వేళల్లో సౌకర్యవంతమైన వాతావరణం అందించడం కోసం హైమాస్ లైట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామగుండం పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, క్రమంగా అన్ని డివిజన్లలో కూడా ఆధునిక సదుపాయాలను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్ టి పి సి టౌన్షిప్ లో ఘనంగా బతుకమ్మ పండగ హాజరైన ఈడి దంపతులు









జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం రాత్రి ఘనంగా బతుకమ్మ పండుగ నిర్వహించారు. అన్ని వీధులు గుడి ఆవరణలో బడి ఆవరణలో కొన్ని వందల స్థలాల్లో వేలాదిమంది మహిళలు బతుకమ్మ ఆడారు. మహిళలకు ప్రతి సంవత్సరం ప్రత్యేక పండుగగా ఉండే సద్దుల బతుకమ్మ కోసం మహిళలు ఉదయం నుంచే బతుకమ్మలు పిలిచి పవిత్రంగా రాత్రి బతుకమ్మలు ఆడారు జ్యోతి నగర్ ఎన్టిపిసి టౌన్షిప్ లోని షాపింగ్ కాంప్లెక్స్ వద్ద పూజా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ పండగ వేడుకలకు రామగుండం ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత రాఖీ సమంత ఇతర జనరల్ మేనేజర్లు దంపతులు హాజరయ్యారు. వివిధ ప్రదేశాల్లో రామగుండం శాసనసభ్యులు దంపతులు హాజరు కాగా రాత్రి ఒంటిగంట వరకు పండగ కొనసాగింది మహిళలు బతుకమ్మ పాటలతో ఆటపాటలతో అలరించారు కోలాటాలతో డీజే పాటలకు నృత్యాలు చేస్తూ మై మర్చిపోయారు. ఏ లాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే గోదావరిఖని లక్ష్మీ నగర్ ఏరియా ఆసుపత్రి ప్రాంతాల్లో వివిధ గల్లీలో రోడ్లపైనే బతుకమ్మలు ఆడడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. వాహనాలు కార్లు అడ్డంగా పెట్టి ఎవరిని వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అత్యవసర పనులను నిమిత్తం వెళ్లేవారు ఆసుపత్రులకు వెళ్లేవారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

# హిందువులను సంఘటితం, చైతన్యం చేయడమే విశ్వహిందూ పరిషత్ సంకల్పం..మోహనకృష్ణ భార్గవ




జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) సెప్టెంబర్ 29: సనాతన హిందూ ధర్మాన్ని, దేవాలయానికి, గోవులను రక్షించడం, మతమార్పిడులను అరికట్టడమే లక్ష్యంగా హిందువులను సంఘటితం, చైతన్యం చేయడమే లక్ష్యంగా విశ్వహిందూ పరిషత్ పనిచేస్తుందని జిల్లా నిర్వాహకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు, మండలంలోని పలువురు చైతన్యవంతమైన హిందువులతో కమిటీ నిర్మాణం చేసారు. మండల అధ్యక్షులుగా లింగపల్లి కిషన్ రావు, కార్యదర్శిగా మరాటి జంపన్న, ప్రభారీగా గాదె సత్యనారాయణ, భజరంగ్ దల్ కల్లెం మోహన్ లాల్ లను నియామకం చేసారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్, గోరక్ష, దేవాలయ పరిరక్షణ, ధర్మప్రసార్, మాతృమండలి, దుర్గావాహిని, సత్సంగ్ వంటి విభాగాలతో విశ్వహిందూ పరిషత్ కార్యవర్గాన్ని నిర్మాణం చేసి, హిందువుల్లో చైతన్యం తీసుకురావాలని దిశానిర్దేశం చేసారు.నూతన కమిటీ ప్రతీ శనివారం ఉదయం మహాదేవస్వామి ఆలయంలో 'హిందూ ఏక్తా సత్సంగం' నిర్వహిస్తామని సంకల్పం చేసారు. మండలంలోని యావత్ హిందువులందరూ సహకరించాలని, గ్రామ కమిటీ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, మండల ప్రముఖులు రవీందర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు

# వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరంన్యూస్) సెప్టెంబర్ 29 :

సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ అనేది తెలంగాణ సాంస్కృతిక జీవన ధార అన్నారు. పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ ఆడపడుచులు ఆనందంగా కలసి పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ ఐక్యత, స్నేహం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు.

బతుకమ్మలో ప్రతి పువ్వు ఒక ప్రత్యేకత కలిగి ఉంటుందని, అవి జీవన సమతౌల్యాన్ని సూచిస్తాయని ఎంపీ వివరించారు. తల్లి ప్రకృతికి కృతజ్ఞతగా జరుపుకునే ఈ పండుగలో మన సంస్కృతి, సంప్రదాయాలు, స్త్రీ శక్తి ప్రతిఫలిస్తాయని తెలియజేసారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం, వారి జీవన ఉత్సాహం ఈ పండుగ ద్వారా ప్రతిఫలిస్తుంది అని అన్నారు.సద్దుల బతుకమ్మ పండుగ కుటుంబాలను, బంధాలను, సమాజాన్ని ఒకే తాటిపైకి తెస్తుందని తెలిపారు. ప్రతి ఇంటా సుఖశాంతులు నిండాలని, తెలంగాణ సంస్కృతి మరింత విశ్వవ్యాప్తంగా వెలుగొందాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు

# ఆస్తులను అమ్మేందుకు అనుమతి ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన సహారా

న్యూఢిల్లీ, సెప్టెంబర్29 సహారా గ్రూప్ కంపెనీల కంపెనీ పాలసీ మేకర్స్ ఈ గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహారాష్ట్రలోని అంబీ వ్యాలీ, లక్నోలోని షహరా సిటీతో సహా వివిధ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించడానికి అనుమతి కోరుతూ సహారా ఇండియా కమర్షియల్ కార్పొరేషన్ లిమిటెడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 14న విచారణ జరిగే అవకాశం ఉన్నది. న్యాయవాది గౌతమ్ అవస్థి దాఖలు ఈ పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబర్ 6 నాటి టర్మ్ షీట్‌లో పేర్కొన్న నిబంధనలు, షరతులపై గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది సహారా గ్రూప్. పెండింగ్‌లో ఉన్న సహారా గ్రూప్ కేసుల్లో దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తులో కోర్టు ఎప్పటికప్పుడు జారీ చేసిన వివిధ ఆదేశాలకు అనుగుణంగా.. అనుమతి పొందిన తర్వాత ఎస్ఐసీసీఎల్, సహారా గ్రూప్ కొన్ని చరాస్తులు, స్థిరాస్తుల అమ్మకాలను చాలా కష్టంతో చేయగలిగాయని తెలిపింది. ఈ నిధులను సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేశారు. మొత్తం రూ.24,030 కోట్ల ప్రిన్సిపల్ మొత్తంలో సహారా గ్రూప్ తన చరాస్తులు, స్థిర ఆస్తుల అమ్మకం, లిక్విడేషన్ ద్వారా సుమారు రూ.16వేల కోట్లు సేకరించి, సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసింది అని తెలిపింది. ఎస్టేట్ బ్రోకరేజ్ కంపెనీల సేవలను ఉపయోగించినప్పటికీ సహారా గ్రూప్ ఆస్తులను లిక్విడేట్ చేయడం, విక్రయించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అసమర్థతను ఎత్తి చూపుతూ.. సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని చాలా కష్టంతో, దరఖాస్తుదారు, సహారా గ్రూప్ ప్రయత్నాల ద్వారా జమ చేశామని ఎస్ఐసీసీఎల్ తెలిపింది. నవంబర్ 2023లో సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ మరణం తర్వాత.. గ్రూప్ తన ఏకైక నిర్ణయాధికారిని కోల్పోయిందని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. ఆయన తన జీవితకాలంలో గ్రూప్ తరఫున అన్ని నిర్ణయాలు తీసుకున్నారని.. దివంగఓత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు సహారా గ్రూప్ రోజువారీ వ్యాపార కార్యకలాపాలు, నిర్వహణలో పాల్గొనలేదని.. అయితే పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాలనే కుటుంబ సభ్యుల కోరికను దృష్టిలో ఉంచుకుని సహారా గ్రూప్ ఆస్తులను సాధ్యమైనంత ఎక్కువ ధరకు విక్రయించాలని.. ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, సహారా గ్రూప్ బాధ్యతలను తీర్చాలని, ప్రస్తుత ధిక్కార చర్యలను ముగించాలని నిర్ణయించినట్లుగా పిటిషన్‌లో పేర్కొంది. వాటాదారుల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా సహారా గ్రూప్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఐసీసీఎల్ తెలిపింది.ఎస్ఐసీసీఎల్ ప్రకారం.. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ఆచరణీయమైన ఆఫర్లు లేకపోవడం, అనేక పెండింగ్ వ్యాజ్యాల కారణంగా ఈ ప్రయత్నాలు ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వలేదని.. ఇది సమష్టిగా కొనుగోలుదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని, ఆస్తుల మార్కెట్ సామర్థ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేసిందని తెలిపింది. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు, సహారా గ్రూప్, ఇతర సీనియర్ అధికారులపై బహుళ దర్యాప్తు సంస్థలు విచారణలు ప్రారంభించడం ద్వారా ప్రయత్నాలు మరింత క్లిష్టంగా మారాయని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. తాము పేర్కొన్నవన్నీ సమాంతర, సమన్వయం లేని చర్యలు పెట్టుబడిదారులు, డిపాజిటర్ల మనసులో గందరగోళం, విరుద్ధమైన కథనాలు, అవసరమైన అనుమానాలను సృష్టించడమే కాకుండా సహారా గ్రూప్ తన ఆస్తులను డబ్బు ఆర్జించడానికి, కోర్టు ఆదేశాలను పాటించడానికి చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుంటున్నాయని పిటిషన్‌లో వెల్లడించింది.

# నందమూరి తారకరత్న జ్ఞాపకాల్లో ఆలక్య



ఒకటో నంబర్ కుర్రాడు' సినిమాతో హీరోగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాడు నందమూరి తారకరత్న. ఎన్నో సినిమాల్లో కథానాయకుడిగా నటించి మెప్పించారు. కేవలం హీరోగానే కాకుండా విలన్ గానూ అదరగొట్టాడీ నందమూరి హీరో. అమరావతి సినిమాలో తారకరత్న విలనిజానికి ఏకంగా నంది అవార్డు కూడా వచ్చింది. తాత ఎన్టీఆర్ లాగే సినిమాలతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలనకున్న తారకతర్న ఊహించని విధంగా చిన్న వయసులోనే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయాడు. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో పాల్గొన్న అతను గుండెపోటుకు గురయ్యాడు. సుమారు 23 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత 2023 ఫిబ్రవరి 18 శివరాత్రి రోజున తుదిశ్వాస విడిచాడు. తారకరత్న మరణంతో నందమూరి కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇక ప్రేమించి పెళ్లి చేసుకున్న అతని భార్య అలేఖ్యా రెడ్డి ఇప్పటికీ ఈ విషాదాన్ని జీర్ణించుకోలేకపోతోంది. నిత్యం తారకరత్న తో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ జీవితాన్ని గడుపుతోంది. తాజాగా మహాలయ అమావాస్య సందర్భంగా తన ముగ్గురు పిల్లలతో కలిసి తారకరత్నకు నివాళులర్పించింది. అనంతరం ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి ఎమోషనల్ అయ్యింది. నా మనసులో భరించలేని బాధ ఉంది. అది ఎప్పటికీ మానిపోని గాయమని తెలుసు. నీ కళ్లు శాశ్వతంగా మూసుకున్న తర్వాతే నీ కోరిక నెరవేరింది. అదే క్షణంలో మిగతావన్నీ కూడా నీతో పాటే వెళ్లిపోయాయి. ప్రస్తుతం నాకు బాధ కలిగించే రోజుల్లో.. నీ కథను తిరిగి వ్రాయడానికి చాలా ఆసక్తిగా ఉన్న ప్రపంచంలో ప్రయాణిస్తున్నా. కాలం గడిచే కొద్దీ నిన్ను మరింతగా మిస్ అవుతున్నా. కొన్ని రోజుల పాటు ఊపిరి పీల్చుకోవడానికి చాలా కష్టంగా అనిపించించింది. దుఃఖం నా గొంతును చుట్టుకున్నట్లు, నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లుగా.. అయినప్పటికీ నేను ఆశను వదులుకోను.. ఎందుకంటే నీ గుండె చప్పుడు ఇప్పటికీ నాలో బతికే ఉంది. అది ఎన్నటికీ నిన్ను గుర్తు చేస్తుంది' అంటే తన భర్తపై తనకున్న ప్రేమకు అక్షర రూపమిచ్చింది తారకరత్న. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. నందమూరి అభిమానులు అలేఖ్యా రెడ్డికి ధైర్యం చెబుతూ కామెంట్స్ పెడుతున్నారు.

## నేచురల్స్ లుక్స్‌లో డింపుల్‌హాయతి



అందం అభినయం ఉన్నా కూడా చాలా మంది హీరోయిన్స్ అదృష్టం కలిసి రాక రేస్ లో వెనకపడుతున్నారు. సినిమా అవకాశాలు అందుకుంటున్నా కూడా సరైన హిట్స్ లేక స్టార్ డమ్ తెచ్చుకోలేకపోతున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నప్పటికీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేక పోతున్నారు. వారిలో డింపుల్ హయాతి ఒకరు. అందం అభినయం ఉన్న ఈ గ్లామర్ బ్యూటీ తన వయ్యారంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇక తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. హీరోయిన్ గానే కాదు.. గెస్ట్ రోల్స్ చేసింది. అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు. అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర ' పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్ తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది. కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్. బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్ గా ఎంపికైంది. ఇటీవలే ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ సినిమా పై డింపుల్ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి ఈ చిన్నదానికి హిట్ అందుతుందేమో చూడాలి. సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# గేమింగ్ యాప్స్‌పై సినీప్రముఖులను విచారించనున్న ఈడీ


ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ దూకుడు ప్రదర్శిస్తోంది. కురాకో దేశంలో నమోదైన వివాదాస్పద ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ వన్ ఎక్స్‌బెట్ ప్రమోషన్లకు సంబంధించి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలు కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అటాచ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నది. పీఎంఎల్‌ఏ చట్టం కింద ఈ చర్యలు చేపట్టబోతున్నట్టు సమాచారం. ఈ కేసులో బాలీవుడ్ సెలబ్రిటీలు, మాజీ క్రికెటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు , పలువురు ప్రముఖుల పేర్లు ఈడీ రాడార్‌లో ఉన్నాయని తెలుస్తోంది. ప్రమోషన్ల ద్వారా వచ్చిన భారీ మొత్తాన్ని చాలామంది విలాసవంతమైన ఆస్తుల కొనుగోలు కోసం వాడుకున్నారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈడీ, వాటిని క్రిమినల్ ఇన్‌కమ్‌గా పరిగణిస్తూ, ఆస్తులపై తాత్కాలికంగా అటాచ్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసే దిశగా పకడ్బందీగా పని చేస్తోంది. ఈడీ దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, ఈ సెలబ్రిటీలకు భారతదేశంతో పాటు యూఏఈ వంటి విదేశాల్లో కూడ స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఆస్తులపై పూర్తి నివేదిక సిద్ధం చేస్తూ, వాటిని తాత్కాలికంగా అటాచ్ చేయడానికి అవసరమైన ఆమోదం కోసం అథారిటీకి ఆర్డర్ పంపించనున్నట్టు సమాచారం. ఆమోదం లభించిన తర్వాత ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి, కోర్టు అనుమతి పొందిన తర్వాత ఆస్తులను శాశ్వతంగా జప్తు చేసే అవకాశముంది. ఈడీ ప్రశ్నించిన సెలబ్రిటీల జాబితాలో పలువురు ప్రముఖులు ఉన్నారు. వీరిలో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, సురేష్ రైనా, రాబిన్ ఊతప్ప, శిఖర్ ధావన్, నటుడు సోను సూద్,బెంగాలీ నటుడు అంకుష్ హజ్రా,తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి,అలాగే ఉర్వశి రౌతేలా ఉన్నారు. అయితే భారత ప్రభుత్వం ఇటీవల ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కానీ, నిషేధానికి ముందు దాదాపు 22 కోట్ల మంది భారతీయులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కనెక్ట్ అయ్యారని అంచనా. వీరిలో సగం మంది యాక్టివ్ యూజర్లు కావడం ఆశ్చర్యకరం.ఇప్పటికే విచారణలు ప్రారంభించడంతో పాటు ఆస్తుల జప్తు ప్రక్రియ కూడా ప్రారంభమైన నేపథ్యంలో, పలువురు సెలబ్రిటీలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని సమాచారం.

## క్యూట్ ఫొటోలు షేర్ చేసిన రీతూ వర్మ



తెలుగమ్మాయి రీతూ వర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ ఇప్పుడు హీరోయిన్‌గా మారిన సినిమాలు చేస్తోంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ వరుసగా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. కెరీర్ బిగినింగ్ లో పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించింది ఈ భామ. ఆతర్వాత సినిమాల్లోకి వచ్చింది. ఎన్టీఆర్ హీరోగా నటించిన బాద్షా సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా హీరోయిన్ చెల్లి పాత్రలో మెరిసింది. ఆ తర్వాత కొంత గ్యాప్ ఇచ్చింది. ఇక హీరోయిన్ గా మారి తొలి సినిమాతోనే ఆకట్టుకుంది. 2013లో ప్రేమ ఇష్క్ కాదల్ అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది రీతూ వర్మ. ఈ సినిమా ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోకపోయినా.. ఈ చిన్నది తన నటనతో మెప్పించింది. ఆతర్వాత నా రాకుమారుడు, ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాల్లో హీరోయిన్ గా చేసి ఆకట్టుకుంది. ఇక 2016లో వచ్చిన పెళ్ళిచూపులు సినిమా ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది. నిన్నిలా నిన్నిలా, టక్ జగదీష్, ఒకే ఒక జీవితం, కణం, ఆకాశం, మార్క్ ఆంటోని సినిమాలు చేసింది. ఈ భామ నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాల ఎంచుకుంటూ రాణిస్తుంది. ఇటీవలే శ్రీవిష్ణుతో స్వాగ్ , సందీప్ కిషన్ తో మజాకా సినిమాలు చేసింది. ఈ రెండు సినిమా అంతగా ఆకట్టుకోకపోయినా యావరేజ్ గా మిగిలాయి. ఇప్పుడు ఈ చిన్నది ఓ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందు రానుంది. దేవిక అండ్ డానీ అనే టైటిల్ తో ఈ వెబ్ సిరీస్ రానుంది. ఈ క్రమంలోనే రీతూ వర్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ ఫోటోలు నెటిజన్స్ ను కట్టిపడేస్తున్నాయి.

# మనల్ని మనం ప్రేమించడమే నిజమైన ప్రేమ : సమంత







టాలీవుడ్ స్టార్ నటి సమంత మళ్లీ తన వ్యక్తిగత జీవితం, ఆలోచనలు గురించి ఓపెన్‌గా మాట్లాడారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. సమంత చెప్పినదాని ప్రకారం, 20 ఏళ్ల వయసులో తాను గుర్తింపు కోసం పరుగులు పెట్టి, రెస్ట్ లేకుండా జీవితం గడిపేసిందని, ఆ ప్రక్రియలో తనను తాను కోల్పోయానని పేర్కొన్నారు. ప్రేమ అంటే ఏమిటో ఎవరూ చెప్పలేదు. కానీ 30 ఏళ్లకు వచ్చేసరికి మహిళలు చూసే ప్రతి విషయం భిన్నంగా ఉంటుంది. అందం, ఆలోచనల్లో మార్పు వస్తుంది" అని చెప్పారు. మనల్ని మనమే ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఇప్పుడు అర్థమైంది. నా ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చుకున్నాను. గతంలో చేసిన తప్పుల జ్ఞాపకాలను మోయడం మానేశాను. ప్రతి అమ్మాయి కూడా ఇలాగే ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. ఇక అభిమానులకు పలు విషయాల గురించి సూచించిన సమంత.. జీవితాన్ని ఆస్వాదించండి, పరుగు తగ్గించండి. మీరు మీలా ఉన్నప్పుడే గర్వంగా, ధైర్యంగా, ఆనందంగా ఉండగలరు. అప్పుడే నిజమైన స్వేచ్ఛ అనుభూతి వస్తుంది" అని చెప్పారు. ఈ వ్యాఖ్యలతో సమంత చైతన్యతో విడాకుల తర్వాత ఎదుర్కొన్న ఒత్తిడి నుంచి బయటపడే ప్రయత్నం చేస్తోందని, ఇంకా పూర్తిగా తేరుకోలేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అయితే ఆమె చెప్పిన మాటల్లో కొత్త ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. కెరీర్ మొదట్లో ఎన్నో ఇబ్బందులు పడ్డ సమంత ఆ తర్వాత మెల్లగా నిలదొక్కుకొని స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ ఓ రేంజ్‌కి వెళ్లిన తర్వాత అక్కినేని హీరో నాగ చైతన్యని వివాహం చేసుకుంది. నాలుగేళ్ల తర్వాత ఎందుకో వారిరివురు విడిపోయారు. ఇప్పటికీ వారి విడాకులకి సంబంధించి క్లారిటీ లేదు. ఇక మయోసైటిస్ బారిన పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్న సమంత క్రమంగా కోలుకొని కెరీర్‌పై ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హానీ, బన్నీ లాంటి సినిమాలతో సమంత క్రేజ్ బాలీవుడ్‌కి కూడా పాకింది. ప్రస్తుతం నిర్మాతగా కూడా సత్తా చాటుతుంది.

# హారిస్ రవూఫ్ భారత్ కోసం పనిచేసే ఓ రా ఏజెంట్

### వైరల్ అవుతోన్న బాబర్ అజామ్ పోస్ట్..

కేవలం 14 రోజుల్లోనే, పాకిస్తాన్ జట్టు టీమిండియా చేతిలో మూడు ఘోర పరాజయాలను చవిచూసింది. వివాదాలు, ఉద్రిక్తతల మధ్య ఆడిన 2025 ఆసియా కప్‌లో, టీం ఇండియా ఫైనల్‌లో పాకిస్తాన్‌ను ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. ఇది టోర్నమెంట్‌లో పాకిస్తాన్‌పై హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. ఫైనల్‌లో పాకిస్తాన్ తరపున అత్యంత చెత్త బౌలర్‌గా నిరూపితమైన హారిస్ రవూఫ్‌పై అభిమానుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అతని తొలగింపునకు డిమాండ్లు వస్తున్నాయి. పాకిస్తాన్ స్టార్ బ్యాట్స్‌మన్ బాబర్ అజామ్ చేసిన పోస్ట్ కూడా వైరల్ అవుతోంది. రవూఫ్‌ను భారతీయ గూఢచారి అని పిలుస్తోంది. సెప్టెంబర్ 28వ తేదీ ఆదివారం దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో, టీమ్ ఇండియా పాకిస్తాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో, టీమిండియా 9వ సారి ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకుంది. పాకిస్తాన్ ఇతర బౌలర్లు పటిష్ట ప్రదర్శన ఇచ్చి టీమ్ ఇండియాకు సమస్యలను సృష్టించగా, ఫాస్ట్ బౌలర్ రౌఫ్ ఘోరంగా ఓడిపోయాడు. రౌఫ్ కేవలం 3.4 ఓవర్లలో 50 పరుగులు ఇచ్చి వికెట్ కూడా తీయలేకపోయాడు. చివరి ఓవర్‌లో అతను 10 పరుగులు డిఫెండ్ చేయాల్సి వచ్చింది. కానీ, అతను అలా చేయడంలో విఫలమయ్యాడు.టోర్నమెంట్ ప్రారంభంలో, భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో రవూఫ్ తన అసభ్యకరమైన భాష, రెచ్చగొట్టే హావభావాలతో ఇప్పటికే వివాదాల్లో చిక్కుకున్నాడు. అయితే, మైదానంలో అతని ప్రదర్శన పాకిస్తాన్ జట్టుకు సహాయం చేయలేకపోయింది. దీంతో అతను విమర్శలకు గురయ్యాడు. ఇంతలో, ఫైనల్ తర్వాత, బాబర్ అజామ్‌కి ఆపాదించబడిన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ స్క్రీన్‌షాట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. రవూఫ్ భారత నిఘా సంస్థ %=ూాఔ%కి గూఢచారి అని ఆరోపించింది. పాకిస్తాన్ ప్రభుత్వం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఆ వైరల్ పోస్ట్‌లో "హారిస్ రవూఫ్ పై దర్యాప్తు ప్రారంభించాలని నేను పాకిస్తాన్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను. అతను ఎల్లప్పుడూ భారత్‌పై చివరి రెండు ఓవర్లు బౌలింగ్ చేసి జట్టు గెలవడానికి సహాయం చేస్తాడు. నేను కెప్టెన్‌గా ఉన్నప్పుడు లో అతను అదే చేశాడు. ఇప్పుడు దుబాయ్‌లో అతను దానినే పునరావృతం చేశాడు. శివం దుబే, తిలక్ వర్మ కొత్త ఆటగాళ్ళు. అతను వారిపై కూడా పరుగులు ఇస్తే, అతను ఖచ్చితంగా %=ూాఔ% ఏజెంట్" అంటూ కామెంట్స్ చేశాడు. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, బాబర్ ఆజం దీన్ని నిజంగా పోస్ట్ చేశాడా? వైరల్ పోస్ట్ వాస్తవ తనిఖీలో ఇది నకిలీ అని తేలింది. బాబర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఇలాంటిదేమీ పోస్ట్ చేయలేదు.

# తండ్రి అడుగుజాడల్లో అజిత్ కుమారుడు



తన విజయాల వెనుక భార్య షాలిని హస్తం ఎంతో ఉందని చెబుతూ ప్రముఖ తమిళ నటుడు అజిత్ కుమార్ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారన్న విషయంపై స్పందించారు. భార్య షాలిని సహకారం లేకపోతే తాను ఇంతదూరం రావడం సాధ్యపడేదికాదని అజిత్ స్పష్టంగా పేర్కొన్నారు. "మేము 2002లో పెళ్లి చేసుకున్నాం. అప్పటినుంచి ఆమె నాకు బలంగా నిలిచింది. నేను రేసింగ్‌కు తిరిగి వచ్చినప్పుడు కూడా ఆమె నాతోపాటే వచ్చేది. ఇంటి విషయాలు, పిల్లల సంరక్షణ, నా పనులపై దృష్టి అన్నింటినీ సమర్థంగా నిర్వహించేది అని ఆయన అన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత షాలిని ఎక్కువగా ఇంటికే పరిమితమైపోయినా, మోటార్ స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని మాత్రం కొనసాగిస్తోందని తెలిపారు. తన కుమారుడు గో-కార్టింగ్ ప్రారంభించిన విషయాన్ని వెల్లడించిన అజిత్, "అతను రేసింగ్‌ను కొనసాగిస్తాడో లేదో అతడే నిర్ణయించాలి. సినిమాలు అయినా, రేసింగ్ అయినా నేను నా అభిప్రాయాలను పిల్లలపై రుద్దను. వారు తమ ఇష్టమైన దారిని ఎంచుకోవాలి. వారికి నేను పూర్తి మద్దతు ఇస్తాను," అని అన్నారు. వృత్తిపరంగా తరచూ ప్రయాణాల్లో ఉండడం వల్ల పిల్లలతో గడిపే సమయం కొంత మేర కోల్పోతున్నానని, కానీ నిజంగా ప్రేమించే పనిని చేస్తే కొన్ని త్యాగాలు అవసరమేనని భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రొఫెషనల్ రేసర్‌గా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించిన అజిత్ ఇటీవల 24హెచ్ దుబాయ్ కారు రేసింగ్ పోటీలో తన జట్టుతో కలిసి మూడో స్థానం సాధించగా, ఇటలీలో జరిగిన 12 రేస్‌లోనూ మూడో స్థానం దక్కించుకున్నారు. సినిమాల పరంగా ఈ ఏడాది 'పట్టుదల' మరియు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అజిత్, త్వరలో తన తదుపరి సినిమా వివరాలను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. రేసింగ్ ట్రాక్‌లో వేగంగా పరిగెత్తే అజిత్, జీవితాన్ని మాత్రం నెమ్మదిగా, విలువలతో, ప్రేమతో నడిపించడంలోనూ ముందున్నారు.

# టీమిండియాకు చిరంజీవి, పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు

**తెలుగుతేజానికి ప్రశంసల వెల్లువ**



ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించి, చారిత్రక మైలు రాయిని చేరుకుంది. ఈ అద్భుత విజయం తో దేశ వ్యాప్తంగా సంబరాలు అంబ రాన్నంటాయి. భారత జట్టు ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి, నైపుణ్యం పై ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. యువ ఆటగాడు తిలక్ వర్మ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడడంతో అతనిపై కూడా ప్రశంసల వర్షం కురుస్తుంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి తన సోషల్ మీడియాలో.. ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై టీమిండియా చూపించిన ప్రదర్శన అద్భుతం. టీమ్ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి, నైపుణ్యం, సంయమనం మెచ్చుకోవల్సిందే. ప్రత్యేకంగా తిలక్ వర్మకు అభినందనలు. ప్రతి భారతీయుడికి ఇది గర్వకారణం" అని తెలిపారు. టాలీవుడ్ హీరో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా భారత జట్టు సభ్యులపై ప్రశంసలు కురిపిస్తూ పోస్ట్ పెట్టారు. టీమ్ ఇండియా మరోసారి తమ సత్తా చూపించింది. తొమ్మిదోసారి ఆసియా కప్ టైటిల్ కైవసం చేసుకుంది. జట్టు సమష్టికృషితోనే ఈ చారిత్రక విజయం సాధ్యమయ్యింది అని అన్నారు. ఇది మన భారతదేశానికి ముందస్తు దసరా కనుక. దీన్ని దేశమంతా సెలబ్రేట్ చేసుకుంటుంది అని పవన్ కళ్యాణ్ పోస్ట్ చేయగా, ఇది కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తమిళ, మలయాళ సినీ తారలు కూడా భారత జట్టును అభినందించారు. మల యాళ సూపర్ స్టార్లు మమ్ముట్టి, మోహన్ లాల్, తదితరులు భారత జట్టు విజయా న్ని మెచ్చుకున్నారు. మమ్ముట్టి మాట్లాడుతూ, "టీమిండియా కేవలం ఆసియా కప్ గెలవడమే కాకుండా, అన్ని మ్యాచ్‌లలో పకడ్బందీగా ఆధిపత్యం చూపించింది. ఇది వారి అసాధారణ సామర్థ్యాన్ని నిరూపిస్తుంది" అని పేర్కొన్నారు.యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ కూడా తన ఆనందాన్ని ట్విట్టర్‌లో పంచుకున్నారు. ఈ విజయం భారత క్రికెట్‌కి గర్వకారణం. తిలక్ వర్మ మంచి ఆటగాడు, అతని ప్రదర్శన చాలా అద్భుతంగా ఉంది అంటూ అభినందనలు తెలిపారు.

# ఆసియా కప్ ట్రోఫీతో పారిపోయిన పాకిస్థాన్ మంత్రి

పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఆసియా కప్ ఆడిన భారతదేశం, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్తాన్ అంతర్గత మంత్రి కూడా అయిన మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోవడానికి నిరాకరించింది. భారత వైమానిక జెట్లను కాల్చివేసినట్లు తన దేశం చేసిన వాదనను ప్రస్తావిస్తూ, ఇటీవల ఆయన రెచ్చగొట్టే ట్వీట్ కూడా చేశారు. అంతేకాకుండా ఉగ్రవాద భావజాలంతో భారతీయ పౌరులను పొట్టన పెట్టుకున్న పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పడానికి వారితో కరచాలనం, ట్రోఫీ అందుకోవడానికి నిరాకరించింది. ఏ ఇతర అధికారి నుంచైనా ట్రోఫీని స్వీకరించడానికి మెన్ ఇన్ బ్లూ సిద్ధంగా ఉందని స్పష్టంగా చెప్పింది. కానీ నఖ్వీ మాత్రం స్పందించలేదు. దీని ఫలితంగా విజేత జట్టుకు కప్ ఇవ్వలేదు. పాకిస్తాన్ తన కపట బుద్ధి చూపించుకున్నా సరే భారత జట్టు వేడుకలకు వెనుకాడలేదు. 'ఊహాత్మక ట్రోఫీ'తో సెలబ్రేషన్స్ చేసుకుంది. ఆన్‌లైన్ ఎమోజీలను వాడుకొని అభిమానులకు ఆనందాన్ని పంచింది. 2024 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ విజయాన్ని రోహిత్ శర్మ ఆసక్తికరంగా జరుపుకున్నాడు, 2022లో ఫిఫా ప్రపంచ కప్ గెలిచిన తర్వాత లియోనెల్ మెస్సీ ట్రోఫీ వాక్‌ను గుర్తుకు తెచ్చింది. ఆసియా కప్ గెలిచిన తర్వాత సూర్యకుమార్ యాదవ్ ఆ సెలబ్రేషన్ శైలిని అనుకరించాడు. పాకిస్తాన్ మంత్రి కప్ ఇవ్వకుండా వెళ్లిపోయినా ఊహాత్మక కప్‌తో ఆ వాక్‌ను గుర్తు చేశాడు.


# ట్రోఫీని తిరస్కరించిన భారత ఆటగాళ్లు



ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ పాకిస్థాన్‌పై అద్భుత విజయం సాధించింది. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ తీసుకోవడానికి భారత ఆటగాళ్లు నిరాకరించారు. ట్రోఫీ, మెడల్స్ తీసుకోకుండానే ఆటగాళ్లు డగౌట్‌కు వెళ్లిపోయారు. భారత్ ట్రోఫీని తిరస్కరించినట్లు ప్రెసెంటేటర్ ప్రకటించారు. దీంతో గ్రౌండ్‌లో ఉన్న ట్రోఫీని వెనక్కి తీసుకెళ్లారు. టీమిండియా ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఈ ఊహించని సంఘటనతో దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. భారత జట్టు ఈ విజయంతో 21 కోట్ల రూపాయల ప్రైజ్‌మనీ గెలుచుకుంది. భారత జట్టు ట్రోఫీ తీసుకోవడానికి నిరాకరించడంతో బహుమతి ప్రదానోత్సవం ఆలస్యమైంది. అదే సమయంలో పాకిస్థాన్ ఆటగాళ్లు కూడా తమ డ్రెస్సింగ్ రూమ్‌లోనే ఉండిపోవడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఇరు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సంఘటన జరిగింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత జరిగిన ఈ టోర్నమెంట్‌లో.. మొదటి నుంచి వాతావరణం వేడిగా ఉంది. అంతకుముందు జరగాల్సిన ట్రోఫీ ఫోటో షూట్‌కు కూడా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నిరాకరించారు. టోర్నమెంట్‌లో లీగ్, సూపర్ ఫోర్ మ్యాచ్‌లలో ఇరు జట్ల ఆటగాళ్లు షేక్ హ్యాండ్ కూడా ఇచ్చుకోలేదు.

ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి తొమ్మిదోసారి ఆసియా కప్ గెలుచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 13 ఓవర్లలో 113/1 స్కోరుతో బలంగా కనిపించింది. కానీ భారత స్పిన్నర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. పాకిస్థాన్ కేవలం 33 పరుగులలో 9 వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది. కుల్దీప్ యాదవ్ ఒకే ఓవర్లో మూడు వికెట్లతో సహా మొత్తం నాలుగు వికెట్లు తీసి పాకిస్థాన్‌ను కుప్పకూల్చాడు. బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి ఒక్కొక్కరు రెండు వికెట్లు తీశారు.భారత్ 147 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ షురూ చేసింది. కానీ 20 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో తిలక్ వర్మ అద్భుతంగా ఆడి 51 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సంజూ శాంసన్, శివమ్ దూబేతో కలిసి ముఖ్యమైన భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టును విజయం వైపు నడిపించాడు. చివర్లో రింకూ సింగ్ బౌండరీతో ఒక బంతి మిగిలి ఉండగానే భారత్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు.

# ఫీజును ఇండియన్ ఆర్మీకి ఇచ్చిన సూర్యా





ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. ఫైనల్ గెలిచిన తర్వాత, పాకిస్తాన్ మంత్రి చేతుల మీదుగా ఆసియా కప్ ట్రోఫీని స్వీకరించడానికి టీం ఇండియా నిరాకరించింది. దీని తర్వాత, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నుంచ ఒక ప్రకటన వెలువడింది, దీనిలో నిజమైన ఆసియా కప్ ట్రోఫీ ఎవరి వద్ద ఉందో ఆయన వెల్లడించారు. మ్యాచ్ జెంటేషన్ తర్వాత, టీం ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అభిషేక్ శర్మతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు, అక్కడ వారు అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చారు.భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్రోఫీని అంగీకరించకపోవడం గురించి మాట్లాడుతూ, "నేను క్రికెట్ ఆడటం ప్రారంభించినప్పటి నుంచి, ఒక ఛాంపియన్ జట్టు ట్రోఫీని తిరస్కరించడం నేను ఎప్పుడూ చూడలేదు. మాకు అలా చేయడం చాలా కష్టం, సులభం కాదు. మేం వరుసగా మంచి మ్యాచ్‌లను గెలిచాం మరియు మేము ఈ ట్రోఫీకి అర్హులం. నేను ఎక్కువ చెప్పనవసరం లేదు, ఎందుకంటే మేం టోర్నమెంట్‌ను అద్భుతంగా ముగించాము."ఆసియా కప్ ట్రోఫీ గురించి సూర్యకుమార్ యాదవ్ ఇలా అన్నాడు, "నాకు, ట్రోఫీ నా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉంది. నా జట్టులోని 14 మంది ఆటగాళ్లు, సహాయక సిబ్బంది నా వద్ద ఉన్న నిజమైన ట్రోఫీ. నాకు, నిజమైన ట్రోఫీ ఆసియా కప్ ప్రారంభం నుంచి మాకు మద్దతు ఇచ్చిన వ్యక్తులే. మేము ఎప్పటికీ నాతో నిలిచి ఉండే మంచి జ్ఞాపకాలతో ఇక్కడి నుంచి బయలుదేరుతున్నాము." గెలిచిన తర్వాత, పెద్ద తెరపై ఇలా రాశారని సూర్యకుమార్ యాదవ్ అన్నారు: "భారతదేశం, 2025 ఆసియా కప్ ఛాంపియన్లు, మీరు దాని కోసమే ఆడుతున్నారు." అని రాశారని ఆటగాళ్లందరూ దీనికి అంగీకరిస్తారని భావించాడు. అభిషేక్ శర్మ దానికి తల ఊపాడు. విజేత ఎవరని అక్కడే ఉన్న పాకిస్తాన్ మీడియాప్రతినిధిని అడిగాడు సూర్య, అతను కూడా మీరే అని చెప్పాడు. దీనికి సూర్య నవ్వుతూ స్పందిస్తూ "చూడండి, అతను అవును అని కూడా చెప్పాడు" అని అన్నాడు. ఒక పాకిస్తాన్ జర్నలిస్ట్ సూర్యను టీం ఇండియా ప్రవర్తన గురించి ప్రశ్నించాడు, భారతదేశం పాకిస్తాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయలేదని లేదా సల్మాన్ అలీ అఘాతో ఫోటోషూట్ చేయలేదని పేర్కొన్నాడు. పాకిస్తాన్ జర్నలిస్ట్ ప్రశ్నకు సూర్య రోహిత్ శైలిలో స్పందించాడు.మ్యాచ్ తర్వాత ఒక పాకిస్తాన్ జర్నలిస్ట్ సూర్యకుమార్ యాదవ్‌ను ఇలా అడిగాడు, "ఈ టోర్నమెంట్ అంతటా మీరు పాకిస్తాన్ జట్టుతో ప్రవర్తించిన విధంగా, మీరు కరచాలనం చేయలేదు, ట్రోఫీ కోసం ఫోటోషూట్ చేయలేదు, అప్పుడు మీరు విలేకరుల సమావేశం నిర్వహించారు, క్రికెట్‌లోకి రాజకీయాలను తీసుకువచ్చిన మొదటి కెప్టెన్ మీరేనని మీరు అనుకుంటున్నారా?"సూర్యకుమార్ యాదవ్ మొదట "నువ్వు మాట్లాడాలనుకుంటున్నావా లేదా?" అని అడిగాడు. తర్వాత, నవ్వుతూ, ఒక మీమ్ వీడియో శైలిలో, "నువ్వు కోపంగా ఉన్నావా? నాకు ఆ ప్రశ్న కూడా అర్థం కాలేదు" అని అన్నాడు. సూర్య స్పందన అక్కడున్న వారందరినీ నవ్వించింది.ఇంతలో, ఒక జర్నలిస్ట్, "మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీని స్వీకరించబోమని %బూజజ%కి %దీజజ×% ఇమెయిల్ పంపింది. ఇది అధికారిక నిర్ణయమా లేక మీ వ్యక్తిగత నిర్ణయమా?" అని అడిగాడు. సూర్య, "మీరు ఏ ఇమెయిల్ గురించి ప్రస్తావిస్తున్నారో నాకు తెలియదు, కానీ ఈ నిర్ణయం మైదానంలోనే తీసుకున్నాం. మీరు ఎప్పుడు గెలుస్తారు, చాలా బాగా ఆడినప్పుడే కదా, టోర్నీ మొత్తం బాగా ఆడాం మేం ట్రోఫీకి అర్హులం కాదా." అప్పుడు జర్నలిస్ట్ అవును అని అన్నాడు, దానికి సూర్య, "మీరు ఇప్పటికే దానికి సమాధానం ఇచ్చారు" అని బదులిచ్చారు."నేను క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి, ఛాంపియన్ జట్టుకు ట్రోఫీ ఇవ్వకపోవడం నేను మొదటిసారి చూశాను. మేము చాలా కష్టపడి ఈ టోర్నమెంట్‌ను గెలుచుకున్నాము. మేము దానికి అర్హులం. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను. నా ట్రోఫీలు నా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నాయి. 14 మంది ఆటగాళ్లు సహాయక సిబ్బంది అందరూ నాతో ఉన్నారు. ఇవే నిజమైన ట్రోఫీలు." అని అన్నారు.

సూర్యకు టోర్నీలో వచ్చిన ఫీజు మొత్తాన్ని భారత ఆర్మీకి ఇస్తున్నట్టు ప్రకటించాడు. ఇది వివాదం అయ్యే అవకాశం ఉందంటూనే ఇదో మంచి పరిణామంగా సూర్య అభిప్రాయపడ్డాడు. దీన్ని కూడా వివాదం చేయబోరని అనుకుంటున్నట్టు చెప్పాడు. గంభీర్ పై తనకు అపారమైన నమ్మకం ఉందని, తన స్వభావాన్ని ఎప్పుడూ అనుమానించనని సూర్య వెల్లడించాడు. అతను ఇలా అన్నాడు: "ప్రతి ఓవర్, రెండు ఓవర్లు, మూడు ఓవర్లు తర్వాత, నేను డగౌట్ వైపు చూస్తాను, నేను అతని వైపు చూస్తాను, అతను ఏదో ఒకటి చెబుతాడు, ఎందుకంటే బయటి నుంచి ఆట పూర్తిగా భిన్నంగా కనిపిస్తుంది. కొన్నిసార్లు, నేను మైదానంలో ఉన్నప్పుడు, ఎవరు బౌలింగ్ చేయాలి, ఏ ఫీల్డ్ ప్లేస్‌మెంట్ చేయాలో నా మనస్సులో చాలా విషయాలు తిరుగుతూ ఉంటాయి, కానీ అతను బయటి నుంచి ఏదైనా సిగ్నల్ ఇచ్చిన వెంటనే, నేను ఆలోచించకుండా చేస్తాను,"పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో హార్దిక్ పాండ్యా లేనప్పుడు గౌతమ్ గంభీర్ శివమ్ దూబేను ఎలా నమ్మాడో కూడా భారత కెప్టెన్ మాట్లాడాడు. "మా ఇద్దరికీ ఒకరిపై ఒకరికి అంత నమ్మకం ఉంది, ఈ ఆట (ఆసియా కప్ ఫైనల్) కూడా, దురదృష్టవశాత్తు హార్దిక్ ఆడలేదు. దీంతో మాకు అదనపు బ్యాటర్ కూడా కావాలి" అని సూర్య చెప్పాడు.."శివం దుబే హార్దిక్ పాండ్యా స్థానంలో బాధ్యత తీసుకుంటాడని గౌతమ్ గంభీర్ చెప్పాడు, నేను అదే అనుకున్నాను, అని చెప్పాను. అతనే సరైన ఎంపికని అనిపిస్తుంది, నేను సరే అన్నాను. దాని గురించి మరింత చర్చించకూడదు, అతను కొత్త బంతిని బౌలింగ్ చేయనివ్వండి, అతను ఆ బాధ్యతను తీసుకోనివ్వండి అని చెప్పాడు. అతను మైదానంలో అదే అద్భుతం చేశాడు."

## అత్యంత ఒడిదుడుకులతో సాగిన తిలక్ వర్మ కెరీర్

నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. పహల్గాం ఉగ్రదాడిలో భారతీయ వనితల తిలకాన్ని పాక్ ఉగ్రమూక తుడిచేస్తే..ఆసియా కప్ 2025 టోర్నీ ఫైనల్లో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ తెలుగు తేజం భారత్‌కు విజయ తిలకాన్ని దిద్దాడు. అయితే ఈ మ్యాచ్ తర్వాత సోషల్ మీడియా వేదికగా ఓ మాట బాగా వైరల్ అయ్యింది.పాకిస్థాన్ జట్టు అభిషేక్ శర్మ కోసం బాగా ప్రిపేర్ అయ్యి ఔట్ చేస్తే.. ఔటాఫ్ సిలబస్‌లా తిలక్ వర్మ దూసుకొచ్చి విజయాన్ని అందించాడు. పాక్ మాజీ క్రికెటర్లు సైతం అభిషేక్ శర్మను ఔట్ చేస్తే మ్యాచ్ గెలిచినట్లేనని పాక్ ఆటగాళ్లకు నూరిపోసారు. అలానే అభిషేక్ శర్మను ఔట్ చేసిన అనంతరం పాకిస్థాన్ సంబరాలు చేసుకుంది. కానీ తిలక్ వర్మ మాత్రం చివరి వరకు నిలబడి.. పాక్ ఆశలను గల్లంతు చేశాడు.హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఐపీఎల్‌లో గత నాలుగు సీజన్లుగా ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడుతున్నాడు. ఈ ఏడాదే ఇంగ్లండ్ కౌంటీల్లోకి అడుగుపెట్టాడు. హాంప్‌షైర్ తరపున బరిలోకి దిగాడు. 2023లో అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే అందరి క్రికెటర్లలానే అతని క్రికెట్ జర్నీ కూడా అంత సాఫీగా ఏమీ సాగలేదు. ఒక లోయర్ మిడిల్ క్లాస్ కుటుంబంలో పుట్టిన తిలక్ వర్మ కెరీర్ అత్యంత ఒడిదుడుకులతో సాగింది.నంబూరి నాగరాజు, గాయత్రి దేవి దంపతులకు ఇద్దరు కుమారులు. అందులో చిన్నవాడే తిలక్ వర్మ. నాగరాజు ఒక సాధారణ ఎలక్ట్రీషియన్. తన కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టపడ్డాడు. తిలక్ వర్మకు చిన్నతనం నుంచే క్రికెట్ అంటే ఇష్టం. అందరి కుర్రాళ్లలానే సరదాగా క్రికెట్ ఆడేవాడు. అయితే తన 11వ ఏట టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడుతున్న తిలక్ వర్మను సలామ్ బయాష్ అనే క్రికెట్ కోచ్ చూశాడు. 11 ఏళ్ల వయసులోనే అద్భుతంగా ఆడుతున్న తిలక్ వర్మను చూసి ఫిదా అయ్యాడు. అతని ప్రతిభను గుర్తించిన సలామ్ బయాష్ క్రికెటర్‌గా మంచి కెరీర్ ఉంటుందని తండ్రి నంబూరి నాగరాజుకు చెప్పాడు. కానీ తిలక్ వర్మ కోచింగ్ కోసం ఖర్చు చేసే స్థోమత తనకు లేదని ఆయన అన్నాడు. అయితే కోచ్ సలామ్ బయాష్.. ఆ ఖర్చులన్నీ తానే భరిస్తానని చెప్పి నాగరాజును ఒప్పించాడు.సలామ్ కోచ్‌గా పని చేస్తున్న లీగాలా క్రికెట్ అకాడమీలో తిలక్ వర్మను తన సొంత ఖర్చుతో చేర్పించాడు. అంతే కాకుండా తిలక్‌కు అవసరమైన కిట్, ఇతర సామాగ్రితో పాటు రవాణ ఖర్చులను కూడా సలామ్ భరించాడు. తిలక్ వర్మ 11వ ఏట నుంచి సలామ్ బయాష్ అన్నీ తానై చూసుకున్నాడు. తిలక్‌కు ఒక మెంటార్‌లా వ్యవహరించి.. ఒక మంచి బ్యాటర్‌గా తీర్చిదిద్దాడు. కొడుకు బాగా ఆడుతున్నాడనే విషయాన్ని గ్రహించిన నాగరాజు.. అతని కోచింగ్ కోసం మరింత కష్టపడ్డాడు. కొడుకు కావాల్సిన ఇతర అవసరాలను చూసుకున్నాడు. వారిద్దరి నమ్మకాన్ని నిలబెట్టుకున్న తిలక్ వర్మ ఏజ్ క్రికెట్‌లో సత్తా చాటి హైదరాబాద్ రంజీ జట్టులోకి ఎంట్రీ ఇచ్చాడు.తిలక్ ప్రతిభను గుర్తించిన ముంబై ఇండియన్స్ అతన్ని వేలంలో కొనుగోలు చేసింది. అప్పటి నుంచి తిలక్ వర్మ వెనుదిరిగి చూసుకోలేదు. ముంబై జట్టు కారణంగా ఆర్థిక సమస్యలు తొలిగిపోయాయి. ఐపీఎల్‌లో తిలక్ సత్తా చాటడంతో టీమిండియా పిలుపు కూడా దక్కింది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609